# మానవ చరిత్ర మనకు నేర్పే గుణపాఠాలేమిటి?

## సి.నరసింహారావు

Best Compliments..., DC


# అపూర్వ జ్ఞాన సంపద

విల్‌డురాంట్ పాతికేళ్ళ ప్రాయంలో వ్రాసిన గ్రంథం 'స్టోరీ ఆఫ్ ఫిలాసఫీ' ప్రపంచ వ్యాప్తంగా అమిత ప్రాచూర్యం పొంది ఆయనకు కోట్ల పారితోషకాన్ని, గొప్ప పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించి పెట్టింది. తన కింతటి ఘనత లభించినందుకు కృతజ్ఞతాభారంతో, తోటి మానవాళికి తన రుణం ఎలా తీర్చుకోవాలా అని విల్‌డురాంట్ మధనపడి చివరకు వేల సంవత్సరాల మానవ చరిత్రను గ్రంథీ కరించాలని నిర్ణయించుకొన్నాడు. ఆ క్రమంలో వేలాది పుస్తకాలను అధ్యయనం చేసి మానవ చరిత్రను క్రోడీకరించే ప్రయత్నం ప్రారంభించాడు. ఏదో నాలుగైదు సంవత్సరా లలో పూర్తవుతుందని భావించిన ఈ ప్రయత్నం చివరకు ఒక మహాయజ్ఞంలా, ఒక కఠినమైన తపస్సులా రూపొందింది. చివరకు పది సంపుటిలలో విల్‌డురాంట్ 'స్టోరీ ఆఫ్ సివిల్‌జేషన్' పూర్తిచేయడానికి నలభైసంవత్సరాల సుదీర్ఘసమయం పట్టింది. యవ్వన ప్రాయంలో ప్రారంభించిన ఈ గ్రంథరచన పూర్తి చేసే సరికి తనకు పూర్తి వృద్ధాప్యం వచ్చేసిందని పేర్కొంటూ, మానవ చరిత్రను దశాబ్దాలపాటు ఆకళింపు చేసుకొన్న తనకు, ఈ చరిత్ర తెలియజెప్పే గుణపాఠాలను అందరికీ తెలియజెప్పాలన్న కోర్కె మిగిలివుందని ఆయన పదవ సంపుటిలో తెలియజేశారు. అది వ్రాసేవరకు తాను బ్రతికుండగలనో లేదోనన్న అనుమానాన్ని కూడా ఆయన అందులో వ్యక్తం చేశారు. చివరకు 'లెసన్స్ ఆఫ్ హిస్టరీ' పేరిట పదకొండవ సంపుటిని వెలువరించారు. అదొక అద్భుత గ్రంథం. మొత్తం మానవ చరిత్ర తెలియజెప్పే గుణపాఠాలను ఆయన అతి స్పష్టంగా, సరళంగా, నిర్మొహమాటంగా అందులో చెప్పడం జరిగింది.

అది చదివిన మరుక్షణమే ఆ జ్ఞానసంపదసారాన్ని తెలుగువారికి అందజేయాలన్న ఆకాంక్షతో, దానిని క్లుప్తీకరించి తెలుగులోకి అనువదించడం జరిగింది.

\- సి. నరసింహారావు

# Maamanava Charitra
# Manaku Nerpe Gunapathalemiti?




Abridged and translated into Telugu by

***C.Narasimha Rao***


First Published in 1990

Price: US $ 5

Publishers:

***Nani International,***

*408,Vijaya Towers, Shanti Nagar, Hyderabad-500 038*




# మానవచరిత్ర మనకు నేర్పే గుణపాఠాలేమిటి?

చరిత్ర అధ్యయనం వలన అసలు ప్రయోజనం ఏమిటి? అసలు ఏనాడు పుస్తకం చేపట్టకుండా తన వ్యాపారమో, తన వృత్తో తాను చేసుకొంటున్న ఒక సామాన్యవ్యక్తి కంటే, చరిత్రను అధ్యయనం చేసిన వారికి మానవ స్వభావం బాగా తెలుసని అను కోగలమా? చరిత్రను అధ్యయనం చేసిన వ్యక్తులు మన వర్తమాన స్థితిగతులను గురించి మన సమాజం చేసే నిర్ణయాలను గురించి, ఆకస్మిక పరిణామాలను గురించి, ఎప్పుడైనా ముమ్ముందుగా గుర్తించగలిగారా? అంటే మనం చరిత్ర నుండి నేర్చుకొన్నదేమీ లేదని, ఫలితంగా గత కాలంలో మానవ సమాజం చేసిన పొరపాట్లన్నీ భవిష్యత్తులో మరింతటి విస్తృత స్థాయిలో పునరావృత్తమౌతాయని అనుకోవచ్చా?

మనకు అనేక సందర్భాలలో అలాగే అనిపిస్తుంటుంది. అంతేకాదు, చరిత్రను గురించిన అనేకానేక సందేహాలు మనల్ని వేధిస్తాయి. గతాన్ని గురించిన అవగాహన ఎప్పుడూ అసమగ్రంగా, కొంతవరకు అస్పష్టంగా, చరిత్రకారుల పక్షపాత ధోరణికి అను

కూలంగా, అవకతవక ఆధారాలకు అనుగుణంగా, వీటన్నింటిని మించి మన జాతీయ అభిమానాన్ని, మత వివక్షతను అనుసరించి మెలికలు తిరుగుతుంటుంది. చరిత్రలో అధిక భాగం ఊహాజనితమైనదైతే మిగిలింది పక్షపాత ధోరణి.

పైగా మనకు మానవ చరిత్ర పూర్తిగా తెలియదు. 'సుమేరియన్' ఈజిప్టియన్ నాగరికతలకు ముందే అనేక ఇతర నాగరికతలు వుండి వుండవచ్చు. వాటిని గురించి మనకేమీ తెలియదు. అంటే చరిత్రను గురించిన పాక్షిక పరిజ్ఞానంతో ఆ పరిజ్ఞానం నుండి జనించే నిర్ణయాలతో మనం సంతృప్తి పడవలసి వస్తోంది.

సైన్స్, రాజకీయ శాస్త్రాలలో లాగానే చరిత్రను కూడా సాపేక్షితా సిద్ధాంతమే నిర్దేశిస్తుంటుంది. ఫలితంగా చరిత్రకు సంబంధించిన రకరకాల సిద్ధాంతాలు, మూల సూత్రాలు పరిహాసాస్పదమైనవిగా, ఎటువంటి విలువాలేనివిగా గాలికెగిరి పోతుంటాయి. ఈ పరిమితుల పరిధిలో మానవ స్వభావాన్ని గురించి, ప్రవర్తనను గురించి, మానవ భవిష్యత్తును గురించి చరిత్ర ఏమి చెబుతుంది? ఇది చాలా సున్నితమైన వ్యవహారం. వేలాది సంవత్సరాల చరిత్రను కొన్ని పేజీల్లోకి కుదించి వేయడానికి, ప్రమాదకరమైన నిర్ణయాలతో నింపివేయడానికి తెలివి తక్కువవారు మాత్రమే ప్రయత్నించగలరు. అయినా మనమూ ఒక ప్రయత్నం చేద్దాం.





# భౌగోళిక స్థితిగతుల గర్భం నుండి చరిత్ర జనిస్తుంది

భౌగోళిక పరిస్థితులపైనే చరిత్ర ఆధారపడివుంటుంది. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట ఎంతో కొంత భూభాగాన్ని సముద్రం కబళిస్తుంటుంది. అలాగే మరోచోట భూభాగం సముద్రాన్ని ఆక్రమిస్తుంటుంది. మన భూసంచనాల్లో హిమాలయాల్లాగా క్రొత్త పర్వతాలు ఆవిర్భవిస్తుంటాయి. అలాగే మరికొన్ని పర్వతాలు అంతర్ధానమవుతుంటాయి. కొన్ని నదులు పొంగిపొర్లుతాయి. మరికొన్ని నదులు ఇంకిపోతాయి. తమ ప్రవాహగతిని మార్చుకొంటుంటాయి. భౌగోళిక దృష్టితో చూస్తే భూమి పైభాగం నిరంతరం మారుతుంటుంది. ఆ మారే భూమిపైన, పూర్వం ఒక మత బోధకుడు సముద్రపు అలలపై నడచిన రీతిలో, అభద్రంగా మానవజాతి సంచరిస్తోంది.

మానవుడు తన శక్తి సామర్థ్యాలతో భౌగోళిక అవరోధాలను అధిగమించవచ్చు. ఎడారులలో వ్యవసాయం చేయవచ్చు. సహారా ఎడారిలో ఎయిర్‌కండిషన్డ్ ఇల్లు నిర్మించవచ్చు. పర్వతాలను తనకు కావలసిన రీతిలో తీర్చిదిద్దుకోవచ్చు. సముద్రంపై తేలే నగరాలను నిర్మించుకోవచ్చు. కాని ఒక ఉప్పెన, వందలాది సంవత్సరాల శ్రమతో నిర్మించు



కొన్న పట్టణాలను కూడ ఒక గంట వ్యవధిలో విధ్వంసం చేయగలదు. మధ్య ఆసియాలో లాగా దీర్ఘకాలం వర్షాలు కురవకపోతే నాగరికతంతా ఇసుక పొరలలోకి ఇంకిపోతుంది. అలాగే వర్షాలు విపరీతంగా, ఉధృతంగా కురుస్తుంటే నాగరికత మధ్యఅమెరికాలో లాగ అరణ్యాలమధ్య చిక్కుకుపోతుంది. చరిత్ర భౌగోళిక పరిస్థితుల గర్భం నుండి జనిస్తుంది. ఆ ప్రకృతిమాతే చరిత్రను పెంచిపోషిస్తుంది. చరిత్రను ఎప్పటికప్పుడు అదుపులో పెడుతుం టుంది. ముందుగా ఇక్కడి నదులు, సరస్సులు, ఒయాసిస్సులు, సముద్రాలు మానవులను తమ ఒడ్డున స్థిరపడమని ఆహ్వానించాయి. జీవకోటి అంతటికీ నీరే ప్రాణప్రదమైనది. అలాగే నగరాల మనుగడకు నీరు మూలాధారమైనది. అంతేకాదు. రవాణాకు, వాణిజ్యానికి నదులు, సముద్రాలే చౌకైన మార్గాలను ఏర్పరుస్తాయి. ఈజిప్టు నాగరికత నైలునది ఇచ్చిన బహుమానం. అలాగే డనూబే నదిని ఆశ్రయించుకొని ఆస్ట్రియా దేశం వృద్ధి పొందింది. ఎల్బీ, రైన్ నదుల పొడవునా జర్మనీ దేశం, రోన్, లోరే, సైర్ నదుల వెంబడి ఫ్రాన్స్, గంగా, బ్రహ్మపుత్ర, కృష్ణా, గోదావరి నదుల వెంబడి భారత సంస్కృతి నెలకొన్నది.

తమ దేశంలో పట్టనంత సంఖ్యలో గ్రీకు జనాభా పెరిగిపోయినప్పుడు వారు మధ్యధరా సముద్రపు అంచున అనేక వలసలు ఏర్పరుచుకొన్నారు. వీరు ఇలా కాలనీలు

నిర్మించుకోవడాన్ని 'చెరువుచుట్టూ కప్పలు చేరడంగా' ప్లేటో అభివర్ణించాడు. అంతేకాదు, క్రీ.పూ. 480లో జరిగిన సలమీస్ యుద్ధం నుండి 1588న స్పానిష్ సేన ఓటమి వరకు అంటే రెండువేల సంవత్సరాలపాటు మధ్యధరా సముద్రపు దక్షిణ, ఉత్తర తీరాలు నిరంతరం తెల్లజాతివారి మధ్య యుద్ధ భూములుగా మిగిలిపోయాయి. కాని 1492 తరువాత కొలంబస్, వాస్కోడిగామాలు తమ సాహసిక ప్రయాణాలతో సముద్రాలను అధిగమించి తెల్లజాతి వారికి క్రొత్త భూభాగాలను చూపించారు. ఫలితంగా అట్లాంటిక్ దేశాలు ఆవిర్భవించాయి. తమ అధిపత్యాన్ని ప్రపంచంలోని సగభాగంలోకి విస్తరించాయి. ఈ మార్పు సముద్రాలను అధిగమించ కలగడం వలన ఒనగూడింది.

విమానాన్ని రూపొందించిన తరువాత ప్రపంచ నాగరికతా స్వరూపం తిరిగి తీవ్రమైన మార్పుకు లోనయ్యింది. సుదూర తీరప్రాంతం కలిగివున్న ఇంగ్లండు, ఫ్రాన్సు వంటి దేశాలు తమకింతవరకూ ఉన్న వాణిజ్య ఆధిక్యతను కోల్పోనారంభించాయి. విశాలమైన భూభాగం అతి తక్కువ తీరప్రాంతం ఉన్న రష్యా, చైనా, బ్రెజిల్ వంటి దేశాలు విమానాల మూలంగా తమకున్న పరిమితులను అధిగమించకలిగాయి. రైళ్లనుండి ఓడలలోకి, తిరిగి ఓడలనుండి రైళ్లలోకి సరుకులు రవాణా చేయడానికే ఉపకరించిన తీరప్రాంత నగరాలు క్రమంగా ఇతర వాణిజ్య రంగాలవైపు తమ దృష్టిని మరల్చసాగాయి. రవాణారంగంలోను, యుద్ధరంగంలోను, నౌకారంగంపై విమానరంగపు ఆధిక్యత నెలకొన్న తరువాత చరిత్రలో ఒక మౌలికమైన విప్లవం చోటు చేసుకుంది.





# జీవశాస్త్రపు మూలసూత్రాలే చరిత్రకు ప్రాధమిక సూత్రాలు

చరిత్రను జీవశాస్త్రపు విభాగంగా కూడా అభివర్ణించవచ్చు. మనం అడవిలో సంచరిస్తోంటే ఎగురుతూ, నడుస్తూ, దొర్లుతూ, అరుస్తూ, పరిగెడుతూ తిరిగే వేలాది జీవ రాసుల్ని మనం గమనించవచ్చు. మనం అడుగిడగానే జంతువులన్నీ చెల్లాచెదురౌతాయి. ఇన్ని వేలాది జీవరాసులమధ్య ఈ భూగ్రహంపై మనం నిలబడి వున్నప్పుడు మన పరిమి తులు మనకు స్పష్టమవుతాయి. నిష్పాక్షికమైన ప్రకృతిమాత ఒడిలో తమ గూటికి ఎగిరి పోయే పక్షుల్లాగా, తమ కలుగులలోకి దూరే జంతువుల్లాగా, రాత్రయ్యేసరికి నివాసాలకు చేరుకునే జీవాలుగా మనల్ని మనం పరిగణించుకుంటే మన అల్పత్వం మనకు దృగ్గోచర మవుతుంది. డబ్బు సంపాదించడం కోసం మన మధ్య నెలకొనే పోటీ, పొందు కోసం మనం పడే ఆరాటం, మన ఆకలి, ప్రేమ, మనకెదురయ్యే విషాదం, మనం జరిపేయుద్ధాలు, పోరాటాలకు, జీవకోటిలో అన్ని జీవరాసులు తమ మనుగడకు సాగించే పోరాటాలకు అత్యంత సామీప్యం, సారూప్యం ఉన్నాయి. మానవజాతి గమనాన్ని అభివర్ణించే చరిత్ర పుటలకు–చెట్లనుండి నేలకు రాలే ఆకుల చాటున, వృక్షాల మాటున, నదీ గర్భాలలోని జీవరాశుల వెనుక దాగిఉన్న రహస్యాలకు–పెద్దగా ఏమీ తేడా లేదు. అంటే జీవశాస్త్రపు మూలసూత్రాలే చరిత్రకు ప్రాధమిక సూత్రాలు. మనుగడకై మనం సాగించే పోరాటంలో, పరిణామ క్రమంలో మనం సైతం నిరంతర మార్పుకు లోనవుతుంటాము. మనలోకొంత మందికి ఈ పోరాట క్రమంలో పాల్గొనవలసిన అవసరం లేకపోవచ్చు. అంటే వారు ఏదో ఒక బృందంలో సభ్యులై వుంటారు. ఆ బృందం అందులోని సభ్యుల్ని కాపాడుతుం టుంది. కాని తిరిగి ఆ బృందం మొత్తం తన మనుగడకై పోరాటం సాగించాల్సివుంటుంది.



# జీవిత మంటే పోటీపడడం

జీవికకు సంబంధించి చరిత్ర చెప్పే మొదటి గుణపాఠం ఏమిటంటే, జీవితమంటే పోటీపడడడం. ఆహారం పుష్కలంగా దొరికినంతవరకు ఈ పోటీ శాంతియుతంగా వుంటుంది. ఆహార కొరత ఏర్పడినప్పుడు ఈ పోటీ దౌర్జన్యయుతంగా రూపుదాలుస్తుంది. ఒక జంతువును మరో జంతువు గుట్టుచప్పుడుకాకుండా, మరో ఆలోచనలేకుండా మింగి వేస్తుంటుంది. చట్టానికి అనుగుణంగా ఒక నాగరికుడు తన తోటి వ్యక్తిని ఇలా గుట్టు చప్పుడు కాకుండా అణచివేస్తుంటాడు. ఆరగిస్తుంటాడు. మన వంటి కోట్లాది మందితోనే మనదేశాలు రూపొందాయి. మనం ఎలా వున్నామో మన దేశం అలాగే వుంటుంది.

మనకు వస్తువులపైన, సంపదలపైన అమితమైన వ్యామోహం. తరతరాలుగా మన పూర్వీకులు తమ మనుగడకోసం సాగించిన పోరాటాలు, తోటివారిని చంపి తమ ప్రాణాలు నిలబెట్టుకున్న స్మృతులు, త్వరలో తిరిగి ఆహారం దొరకదేమోనన్న భయంతో పొట్టపట్టనంతగా తిన్న జ్ఞాపకాలు, మన రక్తనాళాలలో ఇంకా సజీవంగా వున్నాయి. ఆహారం కోసం ఒక వ్యక్తి తన వ్యక్తిగత స్థాయిలో జరిపే పోరాటాన్ని, ఒక దేశం విస్తృత స్థాయిలో జరిపితే దానిని యుద్ధంగా అభివర్ణిస్తాము. మన దేశాలన్నీ ఒకరికొకరు నిరంతరం సహాయ సహకారాలందించుకునే సన్నిహిత కూటమిగా రూపొందినంతటివరకు–వేటాడే దశలో వ్యక్తులు, కుటుంబాలు తమ మనుగడకై ఎటువంటి పోరాటాలు సాగించేవారో నేటి దేశాలు కూడా అటువంటి పోరాటాల్నే మరోరూపంలో సాగిస్తుంటాయి.



# సమానతను చరిత్ర అంగీకరించదు. దానికి కావలసింది సమర్థుల ఎంపిక మాత్రమే

జీవనానికి సంబంధించి చరిత్ర చెప్పే మరొకపాఠం ఎంపిక. ఆహారం కోసం, అధికారం కోసం, పొందుకోసం, జరిపే పోరాటంలో, అప్పుడు నెలకొనే పోటీలో కొన్ని జీవాలు విజయవంతమవుతాయి. మరికొన్ని ఓడిపోతుంటాయి. ఈ విలక్షణ ప్రకృతి మన కనుగుణంగా, మనం నియమించుకునే నిబంధనలకు, ఆదర్శాలకు లోబడి వుండదు.

మన రాజ్యాంగాలలో మనం ఏమైనా పొందుపరచుకోవచ్చు. కాని ప్రకృతి నియమాలు ఈ కట్టడికి లొంగవు. మనకు పుట్టుకతో స్వేచ్ఛ లేదు. సమానత్వం లేదు. మనకు సంక్రమించిన శారీరక, మానసిక వారసత్వం మనకు భిన్నతరహా ఆరోగ్యాన్ని, భిన్నశారీరకశక్తిని, భిన్నమైన వ్యక్తిత్వాన్ని, విలక్షణ మానసిక స్థాయిని అందిస్తుంది. మానవ సమాజంలో సమానత్వం లేకపోవడం, అనేక హెచ్చు తగ్గులుండటం అత్యంత సహజమైన విషయం. అంతేకాదు, మన నాగరికత మరింత సంక్లిష్టమవుతున్న కొద్దీ మానవుల మధ్య అసమానతలు వృద్ధి చెందుతుంటాయి. ఒక అసాధారణ వ్యక్తి ఒక క్రొత్త విషయాన్ని కనుగొంటాడు. నూతన పరికరాన్ని సృష్టిస్తాడు. వీటి ఫలితాలను చేజిక్కించుకున్న వ్యక్తి

మరింతటి బలోపేతుడుగా రూపొందుతాడు. అంతకుముందే బలహీనంగా వున్న వ్యక్తి మరింతటి బలహీనుడవుతాడు. తుపాకులు పట్టుకున్న వందమంది వ్యక్తులు లక్షలాది మందిని నియంత్రించిన సందర్భాలు చరిత్రలో కోకొల్లలు. మన చుట్టుప్రక్కల ఉన్న వారందరినీ సన్నిహితంగా పరిశీలించి వారిలో ఎక్కువ శక్తి సామర్థ్యాలున్న వారిని ఎంపిక చేస్తే వారి సంఖ్య ముప్పై శాతానికి మించకపోయినా, వారి శక్తి సామర్థ్యాలు మిగిలిన డెబ్బై శాతం మందికంటే చాలా అధికంగా ఉంటాయి. జీవన పరిణామక్రమంగాని, చరిత్రగాని ఖచ్చితంగా ఇదే చేస్తుంటాయి. జీవనపోరాటంలో విజేతలుగా మిగిలిన సమర్థులను మాత్రమే అవి ఎంపిక చేస్తుంటాయి.

స్వేచ్ఛ, సమానత్వాలను గురించి మనం చేసే ప్రవచనాలను ప్రకృతి పరిహసిస్తుంటుంది. స్వేచ్ఛ, సమానత్వం ఈ రెండింటి మధ్య నిరంతర వైరం నెలకొని వుంటుంది. అందులో ఒకటి అగ్రస్థానానికి ఎదిగితే మరొకటి అంతరించిపోతుంటుంది. మానవులకు పూర్తి స్వేచ్ఛనిస్తే వారి మధ్య అసమానతలు అపరిమితంగా పెరిగిపోతాయి. 19వ శతాబ్దంలో ఇంగ్లండు, అమెరికాలలో జరిగింది ఖచ్చితంగా ఇదే. అసమానతలు తగ్గించాలంటే కమ్యూనిస్టు విప్లవం చోటుచేసుకున్న తరువాత రష్యాలోలాగ స్వేచ్ఛను పణంగా పెట్టాలి. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను చిదిమివేసిన తరువాత సైతం అసమానతలు అలా నిరంతరం పెరుగుతూనే వుంటాయి. రష్యాలో తిరిగి నెలకొన్న కమ్యూనిస్టు వ్యతిరేక విప్లవమే ఇందుకు నిదర్శనం. ఆర్థికంగా సగటు స్థాయికంటే తక్కువ స్థాయిలో వున్నవారు మాత్రమే మానవుల మధ్య సమానత్వం నెలకొనాలని కోరుకుంటారు. తమకు ఇతరులకంటే అధిక శక్తి సామర్థ్యాలు ఉన్నాయని విశ్వసించేవారు స్వేచ్ఛను కోరుకుంటారు. తరువాత తమ సామర్థ్యం కారణంగా ఇతరులపై ఆధిక్యతను నెలకొల్పుకోగలుగుతారు.






# నిరంతర జీవోత్పత్తి

చరిత్ర చెప్పే మూడవ జీవసంబంధమైన పాఠం నిరంతర జీవోత్పత్తి. జీవోత్పత్తి విస్తృత స్థాయిలో, అపరిమిత సంఖ్యలో జరుగుతున్నప్పుడు మాత్రమే అందులోనుండి మెరుగైన వాటిని ఎంపిక చేసుకోగల సౌలభ్యముంటుంది. ప్రకృతికి మొత్తం జీవరాసుల ఎడలవున్న ఆసక్తి ఒక జీవిపట్ల వుండదు. జనసంఖ్య అపరిమితంగా వున్నప్పుడు నాగరిక స్థాయి, సాంస్కృతిక స్థాయి దిగజారుతుందని, జననాల సంఖ్య పరిమితంగా వున్నప్పుడు సాంస్కృతికంగా నాగరిక స్థాయి ఉచ్ఛస్థితిలో ఉంటుందని ప్రకృతి గుర్తించదు. అంతేకాదు, జననాల సంఖ్య అతి పరిమితంగా వున్న దేశంలో జనసంఖ్యను అపరిమితంగా పెంపొందించగల సమర్ధుల బృందాలను ఎప్పటికప్పుడు ప్రవేశపెడుతుంటుంది.

జనసంఖ్య విపరీతంగా పెరిగిపోయి ఆహార కొరత ఏర్పడితే ఈ రెండింటి మధ్య సమన్వయం సాధించడానికి ప్రకృతివద్ద మూడు ఆయుధాలు ఉన్నాయి. ఇవి క్షామం, అంటురోగాలు, యుద్ధాలు. థామస్ మాల్థ్యూస్ ఆహారోత్పత్తి ఎంతగా పెరిగినా జనాభా సంఖ్యను నియంత్రించకపోతే ఆ ఫలితాలు అందరికీ అందుబాటులోకి రావని చెబుతాడు. కాని అమెరికా, కెనడా వంటి దేశాలు తమ దేశాల్లో క్షామాన్ని, అంటువ్యాధుల్ని నివారించి ఇతర దేశాలకు సైతం లక్షలాది టన్నుల ఆహారధాన్యాలను సరఫరా చేయగలుగుతున్నాయి. వ్యవసాయశాస్త్రంలో వచ్చిన నూతన పరిజ్ఞానాన్ని ప్రపంచమంతటా ఆచరణలో పెట్టగలిగితే ఇప్పుడున్న జనాభాకు రెండింతలమందికి ఆహారాన్ని నిశ్చింతగా సరఫరా చేయవచ్చు. కాని ఇది శాశ్వత పరిష్కారం కాదని జనాభా సంఖ్య పెరుగుదల వలన ఏర్పడుచున్న ఉపద్రవాన్ని మరికొంతకాలంపాటు నిలువరించడమేనని మాల్థ్యూస్

వాదిస్తాడు. భూసారానికి కూడా ఒక పరిమితి ఉంది. వ్యవసాయపరిజ్ఞానంలో వచ్చే విప్లవాత్మకమైన మార్పులన్నింటిని, వాటివలన చేకూరే ఫలితాలను నిరంతరం పెరిగే జనాభా ఏదో ఒక రోజున మ్రింగివేస్తుంది. అలాగే వైద్యరంగంలోను, పరిశుభ్రత విషయం లోనూ వస్తున్న విప్లవాత్మకమైన మార్పులు, నిస్సహాయులను, నిరుపేదలను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రకటించే సంక్షేమ కార్యక్రమాల మూలంగా బలహీనులు సైతం తమ మనుగడ సాగించడానికి, తమవంటి వారిని మరింత మందిని సృష్టించడానికి అవకాశం ఏర్పడు తుంది. ఈ కారణంగా అమిత సాంకేతిక ప్రగతి సాధిస్తున్న మనవంటి దేశాలు సహితం రోజురోజుకు పేదరికంలోకి కూరుకుపోతున్నాయి. జీవోత్పత్తి విపరీతంగా జరిగి అందులో మెరుగైన వారు మిగలడం, బలహీనులు అంతరించి పోవడమేనే జీవసూత్రానికి ఇది ధిక్కరణగా పైకి కనిపించవచ్చు. కాని విద్యావకాశాలు, జీవనస్థాయి, ఉద్యోగావకాశాలు క్రమంగా మెరుగుపడడంతో వెనుకబడిన దేశాలలో సైతం జనాభా పెరుగుదల ఎక్కడో ఒకచోట స్థిరంగా నిలచిపోయి, అవి వృద్ధిచెందిన దేశాలలో పోటీపడగల స్థాయికి జేరుకో గలుగుతాయి. ఆహారోత్పత్తికి జనాభా వృద్ధికి మధ్య సమన్వయం కుదరనంతసేపు ఏదేశమైనా ప్రగతి పథంలోకి మళ్లజాలదు. సంతానోత్పత్తి తమ యవ్వనానికి, ఆరోగ్యానికి చిహ్నంగా నిలవాలేతప్ప, తమ లైంగికారాటం ఫలితంకాకూడదు.





# చరిత్రకు జాతి బేధం లేదు

ప్రపంచానికి సంస్కృతిని, నాగరికతను తామే అందించామని తెల్లజాతి వారు విర్రవీగేవారు. కాని నేటి ప్రపంచ జనాభా 600 కోట్లయితే అందులో తెల్లజాతివారి సంఖ్య 150 కోట్లు మాత్రమే. సంస్కృతి, నాగరికత ఏ ఒక్కరి సొత్తు కాదు. చైనాలో గత 4000 సంవత్సరాలుగా ఒక అత్యద్భుతమైన నాగరికత, సంస్కృతి వెల్లివిరిశాయి. కొలంబస్ అమెరికా సందర్శించకముందే మెక్సికోలో మాయన్, ఆజ్‌టెక్ సంస్కృతులు వెల్లివిరిశాయి. అలాగే దక్షిణ భారతదేశంలో ఉన్న ద్రావిడ సంస్కృతి అతి పురాతనమైనది. అత్యున్నత మైనది. మద్రాస్, మధురై, తిరుచనాపల్లిలోనున్న కళారూపాలు ప్రపంచంలోని మరే కళారూపాలకు తీసిపోవు. అందుకే చరిత్రకు జాతులతో నిమిత్తంలేదు. నాగరికత జాతుల ప్రసక్తిలేకుండా ప్రపంచంలో ఏ ప్రాంతాంలోనైనా వృద్ధి చెందవచ్చు. నాగరికతను రూపొం దించేది జాతి కాదు. నాగరికతే ఉన్నత మానవ సమాజాన్ని నిర్మిస్తుంటుంది. ఒక ప్రాంతానికి విభిన్న సమయాలలో, విభిన్న మార్గాల నుండి వచ్చి జేరిన భిన్న రకాల ప్రజల సాంప్రదాయాలు, తీరుతెన్నులు వారివారి రక్తాలూ కలగలసి నూతన సమ్మేళనాలు ఏర్పడుతుంటాయి. శతాబ్దాల తరబడి కొనసాగిన ఇటువంటి సమ్మేళనాల ఫలితంగా ఒక క్రొత్త జాతి ఆవిర్భవిస్తుంది. ఆంగ్లేయులు అంటే రోమన్లు, శాక్సన్లు, జ్యూట్‌లు, డేన్‌లు, నార్మన్లు, సెల్ట్లు, ఆంగెల్సు కలగలసి ఏర్పడిన సమ్మేళనమే. ఇలా క్రొత్త తరహా వ్యక్తులు ఆవిర్భవించినపుడు ఒక నూతన నాగరికత సైతం వారినుండి ఉదయిస్తుంది.

వారిని ఆశ్రయించుకొని ఒక భిన్నమైన సంస్కృతి విప్పారుతుంది. విశిష్టమైన, విలక్షణమైన సంస్కృతి, నాగరికతలతోబాటు నూతన శరీరాకృతులు, నూతన వ్యక్తిత్వం, క్రొత్తభాష, నూతన సాహిత్యం, వినూత్నమైన కళలు, మతం, నైతిక విలువలు చోటుచేసుకుంటాయి.

జాతుల సమ్మేళనం అమెరికన్ నాగరికతలో ఇంకా పూర్తికాలేదు. 1700 నుండి 1848 వరకు ఫ్లోరిడాకు ఉత్తరానవున్న అమెరికన్లు దాదాపు అందరూ ఇంగ్లండు నుండి వచ్చిన ఆంగ్లేయులే. 1848 తరువాత అనేకరకాల తెల్లజాతివారు అమెరికాకు రాసాగారు. వివిధ జాతుల మధ్య సంగమం ఏర్పడడం ప్రారంభమైంది. ఈ సంగమం పూర్తి కావడానికి కొన్ని శతాబ్దాలు పడుతుంది. ఆ తరువాత మాత్రమే అమెరికా దేశానికి ఒక విలక్షణమైన భాష, కళారూపాలు, సాహిత్యం ఏర్పడతాయి.

వివిధ ప్రాంతాలలో నివశించే ప్రజలు తమదైన సంస్కృతులను సంతరించు కుంటారు. వేషభాషలు, అలవాట్లు, మత విశ్వాసాలు, నైతిక విలువలకు సంబంధించి తమ తమ ప్రాంతాలకు అనుగుణమైన అలవాట్లను అందిపుచ్చుకున్న తరువాత వారిలో ఇతర జాతులు, ఇతర ప్రాంతాలపట్ల అవగాహన కొరవడినప్పుడు జాతి విద్వేషం తలెత్తు తుంటుంది. ఇతరుల పట్ల సరైన సమగ్రమైన అవగాహన పెంపొందించుకోవడమే ఈ జాతి విద్వేషానికి సరైన మందు. నేటి మానవ నాగరికత రకరకాల ప్రజలు ఒకరికొకరు తోడ్పాటును, సహకారాన్ని అందించుకోవడం వలననే సాధ్యపడిందని చరిత్ర మనకు తెలియజెబుతోంది. ఈ నాగరికతలోని ఔన్నత్యానికి, లోపాలకు ఈ ప్రపంచంలో నివశించే ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులే. ప్రతి ఒక్కరూ వారసులే. అతి తక్కువ స్థాయిలో, ప్రపంచంలో ఎక్కడో మారుమూల నివశిస్తున్న ఎవరో ఒక వ్యక్తి కూడా ప్రపంచ నాగరికతా వైభవానికి తమ భాగస్వామ్యాన్ని సమర్పించిన బృందంలోని సభ్యుడే.





# చరిత్రలో ఆశ్చర్యకరమయిన సమన్వయం, ఏకత్వం

చరిత్ర పరిణామంలో మానవ ప్రవృత్తిలో వచ్చిన మార్పు ఏమిటి? మానవ పరిణామక్రమంలో ప్రధాన సూత్రమైన "సహజమైన ఎంపిక" – అంటే శారీరకంగా, మానసికంగా సమర్థులైనవారు మాత్రమే మిగలడం – అసమర్థులు అంతర్ధానం కావడం నిరంతరం జరుగుతూనే వుంటుంది. గనుక సిద్ధాంతపరంగా పరిశీలిస్తే ఎంతో కొంత మార్పు ఖచ్చితంగా వచ్చి ఉండాలి. కాని మనకు తెలిసిన చరిత్రలో మానవ ప్రవర్తనలో పెద్ద మార్పేదీ కనబడదు. ప్లేటోకు సమకాలీకులైన గ్రీకులు ఇప్పుడు ఆధునిక ఫ్రెంచ్ వారిలాగానే ప్రవర్తించేవారు. అలాగే రోమన్లు నేటి ఆంగ్లేయులుగా ప్రవర్తించేవారు. మార్గాలు భిన్నం కావచ్చు. సాధనాలు మారవచ్చు. కాని వారి వారి లక్ష్యాలు, గమ్యాలు ఒకే కోవకు చెందినవి. పనిచేయడంలో గాని, విశ్రాంతి తీసుకోవడంలోగాని, వెనుదిరగడంలో గాని, ఇతరుల పొందు కోరడంలోగాని, తిరస్కరించడంలోగాని, పదిమందిలో కలవడంలో గాని, ఏకాంతంగా ఉండడంలోగాని పెద్ద తేడా ఏమీలేదు. వివిధ సందర్భాలలో పేద ప్రజలు, ధనవంతులు ఒకే రకంగా ప్రవర్తిస్తారు. ఒకే రకంగా కోరుకుంటారు. తాము కోరుకున్నవి సాధించడానికి కొందరికి అవకాశాలుంటాయి. నైపుణ్యం ఉంటుంది. కొందరికి అవి కొరవడతాయి. ఎప్పటికప్పుడు మార్పు వస్తున్నట్లు కనిపిస్తుంటుంది.

కాని ఆ మార్పు వచ్చినంత వేగంగానే కాలగర్భంలో కలసిపోతుంది. కొందరు తిరుగుబాటు దారులు అధికారంలో ఉన్నవారిని తెగనాడి, వారి పద్ధతులను నిరసించి, అధికారం నుండి వారిని క్రూలదోసిన తరువాత తాముకూడా తిరిగి అవే పద్ధతులను ఆచరించడం చరిత్రలో ప్రతి సందర్భంలోను మనకు దర్శనమిస్తుంటుంది.

చరిత్రలో ఎప్పటికప్పుడు నూతన పరిణామాలు ఎదురవుతుంటాయి. వీటికి అనుగుణంగా కొంగ్రొత్త సంఘటనలు చోటుచేసుకుంటుంటాయి. ఒక గొప్ప వ్యక్తి, ఒక విజ్ఞాని, ఒక సాహసికుడు, ఒక మేధావి చరిత్రలో అతి ముఖ్యపాత్రలను పోషిస్తుంటారు. వేలాదిమంది సైనికులు చేయలేనిపనిని, లక్షలాది సంఘసేవకులు ఆచరించలేని పనిని ఒక మహాత్మా గాంధీ చేయగలిగాడు. ఒక లూయిపాశ్చర్, ఒక మోర్స్, ఒక ఎడిసన్, ఒక ఫోర్డు, ఒక లెనిన్ మానవ చరిత్రలో సాధించిన ఫలితాలు అసంఖ్యాక పరిమాణాలకు త్రోవదీసాయి. తిరిగి ఈ పరిణామాలు అపరిమితమైన ఫలితాలను సృష్టించాయి.

తాము నివసిస్తున్న సమాజంలో ఆచార వ్యవహారాలను, సాంప్రదాయాలను పూర్తిగా త్రోసిపుచ్చడం ఎంతగా చదువుకున్న వ్యక్తికైనా, ఎంతటి విజ్ఞానికైనా సాధ్యం కాదు. వీటన్నింటిని సవ్యంగా, సమగ్రంగా అన్ని కోణాల నుండి అర్థం చేసుకుని వాటి మంచి చెడులు నిర్ణయించడానికి ఒక జీవితకాలం సరిపోదు. శతాబ్దాల తరబడి 'చరిత్ర' అనే ప్రయోగశాలలో అనేక తరాల ప్రజల ప్రయోగాల ఫలితాలే నేటి సాంప్రదాయాలుగా, కట్టుబాట్లుగా కొనసాగుతున్నాయి. యవ్వన ప్రాయంలో, లైంగిక ప్రేరణల ఉధృతిలో ఉద్రూతలూగే యువకుడు తన లైంగిక ప్రేరణలు తన ఇష్టం వచ్చినట్లు తీర్చుకునే అవకాశాలు కల్పించకుండా అనేక నిర్దేశనలు విధించే సమాజంపై విరుచుకుపడతాడు. అతను కోరేరీతిలో అతనికి పూర్తి స్వేచ్ఛను కల్పించితే ఏమవుతుంది? లైంగిక ఉధృతి అగ్ని ప్రవాహం వంటిదని, దానిని గట్లు వేసి చల్లబరచి సరైన మార్గానికి మళ్లించకపోతే, కట్టుబాట్లు, నైతిక విలువలు, చట్టాల సాయంతో దానిని అదుపుచేయకపోతే అది తనను, తోటి సమాజాన్ని కూడా చిందరవందర చేస్తుందని గుర్తించగల పరిణితి పొందే లోపే ఆ యువకుడు తన జీవితాన్ని నాశనం చేసుకుంటాడు. మార్పును వ్యతిరేకించే సాంప్రదాయ వాది సైతం మార్పు కోరే సంస్కరణాభిలాషి వంటి విలువైన వ్యక్తే. నూతన సంస్కరణలు నూతన ఆలోచనలు పది మందిలో వ్యాపించాలి. అవి అభ్యంతరాల కొలిమిలో కాలాలి. తిరస్కారాల సమ్మెట దెబ్బలు తినాలి. ఇలా ప్రతి నూతన ఆలోచన ప్రాథమిక దశలో ఎదురయ్యే వ్యతిరేకతను తట్టుకొని నిలచినప్పుడు మాత్రమే దానికి మానవ సమాజంలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుంది. ఈ పాత క్రొత్తల సంఘర్షణ నుండి ఏర్పడిన మేలు కలయిక ఒక క్రొత్త శక్తిని, స్ఫూర్తిని, ఉత్తేజాన్ని, ప్రగతిని కలిగిస్తుంది. సమాజాన్ని ఐక్యంగా ఉంచుతుంది.



# చరిత్రలో మంచీ చెడుల, నీతి అవినీతుల దోబూచులాటలు

చరిత్రను పరిమిత స్థాయిలో అర్థం చేసుకుంటే నైతిక సూత్రాలు పెద్ద విలువ లేనివని, అవి వివిధ ప్రాంతాల్లో, వివిధ కాలాల్లో, విభిన్న రూపాల్లో కొనసాగుతుంటాయని, అంతేకాకుండా ఒకదానికి, మరొకదానికి మధ్య వైరుధ్యాలు ఉన్నాయని అనిపించవచ్చు. కాని చరిత్రను సమగ్రంగా అవగాహన చేసుకున్నప్పుడు ప్రపంచమంతటికీ అనువర్తించే నైతిక సూత్రాల ఆవశ్యకత వెల్లడవుతుంది. నైతిక సూత్రాలు అన్ని చోట్లా ఒకేవిధంగా లేకుండా వాటి మధ్య వైవిధ్యం ఎందుకుంటుంది ? ఎందుకంటే చారిత్రక కారణాలకు, పరిసరాల ప్రభావాలకు అనుగుణంగా వాటిని అవి తీర్చిదిద్దుకోవాలి గనుక. వేటాడే దశలో వేటాడడానికి, పోరాటానికి, చంపడానికి మానవుడు నిరంతరం సిద్ధంగా ఉండేవాడు. వేటాడుతూ తన ప్రాణాలను కోల్పోవడానికి పురుషుడు నిరంతరం సిద్ధంగా వుండటం వలన సహజంగానే మగవారి మరణాల సంఖ్య, స్త్రీల మరణాల సంఖ్య కంటే చాలా ఎక్కువగా వుండేది. ఫలితంగా ఎక్కువ మంది స్త్రీలను తన చెంత చేర్చుకోవడం, ఎక్కువమంది స్త్రీలను గర్భవతులను చేయడం ఆరోజుల్లో మగవారి పవిత్ర బాధ్యతగా ఉండేది. మనుగడకు పోరాటం సల్పే రోజుల్లో క్రూరత్వం, తిండికోసం నిరంతర ఆరాటం,

లైంగిక సమాగానికి సిద్ధంగా ఉండడం ఆనాటి వారికి ఎంతగానో ఉపకరించే విశేషాలు. ఈనాడు దురాచారంగా ఈసడించే ప్రతి అంశమూ ఒకానొకప్పుడు సదాచారంగా పరిగణించబడి ఒక వ్యక్తికిగాని, అతడి కుటుంబానికిగాని, అతను నివశించే సమాజానికి గాని ఉపకరించి ఉండవచ్చు. మానవచరిత్రలో చోటుచేసుకున్న పాపాలన్నీ మనం నేటి ఈ స్థితికి చేరుకోవడానికి తోడ్పడి ఉండవచ్చు.

వేటాడే దశనుండి వ్యవసాయం చేసే దశకు మానవుడు ఎప్పుడు చేరుకున్నాడో చరిత్ర మనకు స్పష్టంగా చెప్పదు. ఆహారధాన్యాలను నాటి, పండించవచ్చునని కనుగొన్న తరువాత, క్రొత్తరాతియుగంలో బహుశా ఈ మార్పు జరిగి వుండవచ్చు. ఈ దశలో కొత్త నీతి సూత్రాలు చోటుచేసుకుని పాతసూత్రాలను అవి నీతిబాహ్యమైనవిగా మార్చి వుంటాయి. వ్యవసాయదశలో సాహసంకంటే కష్టపడి పనిచేయడం ప్రధానమైన అంశం. దౌర్జన్యం, క్రూరత్వంల కంటే పొదుపు, క్రమబద్ధత ప్రధానమయ్యాయి. యుద్ధం చేయడంకంటే శాంతియుతంగా వుండడం విజయానికి చిహ్నంగా మారింది.

ఆ కాలంలో పిల్లల్ని సంపద కూడబెట్టడానికి తోడ్పడేవారిగా పరిగణించడం మొదలయింది. జనాభా నియంత్రణ అప్పుడు నీతిబాహ్యమైన విషయం. పిల్లలు పుట్టని వారిని ఈసడించుకోవడం అప్పట్లో సహజమైన విషయం. అప్పుడు మొత్తం కుటుంబ సభ్యులందరూ వ్యవసాయ ఉత్పత్తిలో పాలుపంచుకునేవారు. తల్లిదండ్రులు ఏర్పరచే క్రమశిక్షణకు ఆ రోజుల్లో అందరూ తలొగ్గేవారు.

తమ ఆర్థిక అవసరాలన్నీ కుటుంబ పెద్దలే తీర్చుతుండం దీనికి మూలకారణం. 15 సంవత్సరాల వయసు వచ్చిన యువకుడు తన బాధ్యతలను తేలిగ్గా గుర్తించేవాడు.





కొద్దిపాటి భూమి, ఒక నాగలి, దానితో దున్నే శక్తి తనకు వుంటే చాలు. అతను తనలో లైంగిక స్పందనలు మొదలుకాగానే వివాహం చేసుకునేవాడు. ఇక యువతులకు సంబంధించి లైంగిక పవిత్రత అత్యంత ప్రధానవిషయంగా వుండేది. ఎక్కడైనా తప్పటడుగు వేస్తే రక్షణలేని మాతృత్వం సంక్రమిస్తుందేమోనని వణికి పోయేవారు. పైగా స్త్రీ, పురుష జనాభా దాదాపు సరిసమానంగా వుండడంతో ఏకపత్నీ వ్రతం తప్పనిసరై కూర్చుంది. 1500 సంవత్సరాలపాటు ఈ వ్యవసాయక సంబంధమైన నైతిక సూత్రాలు – అంటే లైంగిక నిబద్ధత, బాల్యవివాహం, విడాకులు ఇవ్వడానికి వీలులేని దాంపత్య జీవితం, వీలైనంత ఎక్కువమంది పిల్లలను కనడం, యూరపులోను, తెల్లవారి వలస ప్రాంతాల్లోను అమలులో వుండేది.

కాని పారిశ్రామిక విప్లవం వచ్చిన తరువాత యూరపులోను, అమెరికాలోను ఆర్థిక జీవితం, దానిపై ఆధారపడ్డ నైతిక సూత్రాలు అనేక మార్పులకు లోనయ్యాయి. మగవారు, స్త్రీలు, పిల్లలు ఎవరికి వారే ఒంటరిగా కర్మాగారాలలో పనిచేయడానికి వెళ్లేవారు. ఎవరికి వారికి జీతం లభించేది. మనుషుల కోసం కాకుండా పెద్ద పెద్ద యంత్రాలను పెట్టడం కోసం భారీ కట్టడాలు కట్టడం ప్రారంభమైంది. ఇక ప్రతి దశాబ్దం గడిచేకొద్దీ యంత్రాల సంఖ్య అనేక రెట్లు పెరిగిపోనారంభించింది. ఆ యంత్రాల పరిధి మరింత విస్తృతమౌతూ వచ్చింది. ఇలా చాలాకాలం సాగిన తరువాత మాత్రమే యాంత్రిక యుగపు ఆర్థిక స్థితి ఒక కొలిక్కి వచ్చింది. పిల్లలు తమ సంపాదనలో తోడ్పడే వ్యక్తులు కారు. పైగా పిల్లలు పుట్టడం, వారిని సాకడం తమ సంపాదనకు అవరోధమై కూర్చొంది. ఫలితంగా వివాహాలను వయసుమీరే వరకు వాయిదా వేయవలసిన పరిస్థితి ఎదురైంది.

దీని కారణంగా వివాహానికి ముందు లైంగిక సంబంధాలు ఏర్పరచుకోకుండా నిభాయించుకోవడం చాలా కష్టమైపోయింది. అలాగే తల్లిదండ్రులపై తమ ఆర్థిక అవసరాలకోసం ఆధారపడకుండా ఎవరికి వారు స్వంతంగా సంపాదించుకునే అవకాశాలు ఏర్పడడంతో తమపై పెద్దల ఆధిపత్యాన్ని ప్రశ్నించడం మొదలైంది. అలాగే విద్య అందరికీ అందుబాటులోకి రావడంతో మతవిశ్వాసాల్ని ప్రశ్నించడం ప్రారంభమైంది. నైతిక సూత్రాలకు మూలాధారమైన పరిస్థితులలో అనేకమార్పులు వచ్చి పడడంతో పాత నైతిక నియమావళి సడలిపోసాగింది. పైగా చీటికిమాటికి చెలరేగే యుద్ధాలు సైతం నైతిక విలువలు దిగజారడానికి ఎంతో దోహదంచేశాయి.

నేడు మనం పాపాలుగా భావించేవన్నీ ప్రతికాలంలోను విపరీతంగానే వున్నాయన్న చారిత్రక సత్యం మనకు కొంత ఊరట కల్గిస్తుంది. ఈనాడు పాశ్చాత్య దేశాల్లో విశృంఖలంగా సాగుతున్న హోమో సెక్సువాలిటీ పూర్వం గ్రీసులోను, రోమ్‌లోను, రినైజాన్స్ కాలంనాటి ఇటలీలోను ఉన్న హోమో సెక్సువాలిటి ముందు దిగదుడుపే. అలాగే వ్యభిచారం కూడా ప్రపంచ వ్యాప్తంగా, నిరంతరాయంగా కొనసాగుతూనే వుంది. సిరియాలో వందలాది సంవత్సరాల క్రితమే ప్రభుత్వమే వ్యభిచార గృహాలను నడుపుతుండేది. 1544 విటిన్‌బర్గ్ యూనివర్శిటీలో యువతులు స్వేచ్ఛగా, విశృంఖలంగా మగవారి గదులలో జొరబడి ఎప్పుడుబడితే అప్పుడు తమ లైంగిక వాంఛలను తీర్చుకుంటున్నారని లూథర్ తన గ్రంథంలో పేర్కొన్నాడు. అశ్లీల సాహిత్యం కోసం జనం విరగబడేవారని అదే సమయంలో మొన్‌టైనీ పేర్కొన్నాడు. నినేవా త్రవ్వకాలలో పాచికలు బయటపడ్డాయి. వేలాది సంవత్సరాల క్రితమే స్త్రీ పురుషులు జూదక్రీడలో పాల్గొనేవారని తెలియవస్తోంది. భారత యుద్ధానికి మూల



కారణం కూడ జూదమేనని మనకు తెలుసు. ఇలా ప్రతి కాలంలోను, ఈనాడు మనం ఈసడించుకునేవన్నీ జరుగుతూనే వుండేవి. మగవారు భార్యలను మోసగించడం అనాదిగా జరుగుతూనే వుంది. ప్రభుత్వాలన్నీ అవినీతిలో కూరుకుపోయే వుండేవి. ఆ మాట కొస్తే అవినీతి ఇప్పటి ప్రభుత్వాలలో కంటే పూర్వ ప్రభుత్వాలలోనే విపరీతంగా వుండేది. అలాగే మానవులు ఏ నీతి సూత్రాలకూ ఏనాడు పూర్తిగా కట్టుబడిలేరు.

'మానవ జాతి చేసిన నేరాలు, పొరపాట్లు, దురదృష్టాల కలయికగా' వాల్తేరు చరిత్రను అభివర్ణించాడు. గిబ్బన్ దానిని సమర్ధించాడు. కాని రోత కలిగించే ఈ రాజకీయాలు, ఈ యుద్ధాలు, ఈ అక్రమసంబంధాలు, విడాకులు, హత్యలు, ఆత్మహత్యలు, క్రూరత్వాలు, నేరాల వెనుక, లక్షలాది లేక కోట్లాది సక్రమంగా సాగిపోయిన సంసారాలు, ఒకరికొకరు అంకితమైపోయి అన్యోన్య దాంపత్యాన్ని కొనసాగించిన భార్యాభర్తలు, తోటివారిపట్ల కరుణను, వాత్సల్యాన్ని కురిపించిన స్త్రీ పురుషులు, అనేక సమస్యల మధ్య, ఒడిదుడుకుల మధ్య సంతోషంగా జీవనాన్ని సాగించిన వ్యక్తులు మనకు దర్శనమిస్తారు. మానవ ఔదార్యం, ఔన్నత్యం, మంచితనాన్ని కనబరిచే అనేక సంఘటనలు లిఖిత చరిత్రలోనే మనకు కోకొల్లలుగ కనబడతాయి. వీటి నేపథ్యంలో కనపడే పాపాలను మనం మరువలేక పోయినా వాటిని క్షమించి వేయవచ్చు. యుద్ధరంగంలో బహిర్గతమైన మానవ కౄరత్వం, జైళ్ళలోని దుర్మార్గాలకు  ధీటుగా, లేక అంతకుమించి మానవ ఔదార్యం, కరుణ వెల్లడైన సందర్భాలు చరిత్రలో అనేకం ఉన్నాయి. అందుకే నేడు కనిపిస్తున్న నైతిక విలువల పతనం మన సమాజం పతనావస్థకు చేరుకోవడానికి సంకేతంగా పరిగణించడం ఏ మాత్రం సరికాదు. వ్యవసాయక దశనుండి పారిశ్రామికనాగరికతవైపు పరిణామం చెందుతున్న మానవ సమాజం క్రొత్త నైతిక నియమావళిని సమకూర్చుకునే దశలో ఉంది. పారిశ్రామిక నాగరికత ఇంకా సంపూర్ణంగా రూపుదిద్దుకోలేదు గనుక మనకు ప్రస్తుత స్థితి గందరగోళంగా కన్పించవచ్చు. అంతే!





# పేదరికం, దుఃఖం మతానికి మూల స్తంభాలు

మతానికి మొదట్లో నీతి నియమావళితో ఎటువంటి సంబంధమూ వున్నట్లు కనబడదు. మొదట్లో భయం దేవుళ్లను సృష్టించింది. భూమిపైన, నదుల్లోను, సముద్రాల్లోను, అరణ్యాలలోను, గాలిలోను, ఆకాశంలోను దాగివున్న అంతర్గత శక్తులను చూసి ఆదిమ మానవుడు వణికిపోయేవాడు. జంతువులనుండి, అగ్నిపర్వతాలనుండి, భూకంపాలనుండి, ఉప్పెనలనుండి, తుఫానులనుండి, పిడుగులనుండి, వరదలనుండి తనను తాను రక్షించుకునే ప్రయత్నంలో వాటిని ఆరాధించేవాడు. ఇలా ఆరాధిస్తూ మొక్కుబడులు చెల్లించడం, బలులు ఇవ్వడం, ప్రార్ధనలు చేయడం, తాయెత్తులు కట్టుకోవడం వరకే మొదట్లో మతం పరిమితమయి వుండేది. తరువాత పూజారులు, మత బోధకులు బయలుదేరారు. మానవులలోని భయాల్ని, వారిలోని ఆరాధనా స్వభావాన్ని అడ్డం పెట్టుకుని ఒక నీతినియమావళిని, చట్టాన్ని ప్రతిపాదించి వీటిని దైవభావానికి అనుసంధానం చేయడం ద్వారా మతాన్ని ఒక బలీయమైన శక్తిగా, ప్రభుత్వాలకు పోటీగా రూపొందించారు.

ఎటువంటి విశ్వాసాలు లేని చరిత్రకారులు సైతం అన్ని కాలాలలోను, అన్ని చోట్ల విస్తరించిన మతం పట్ల వినమ్రతను, గౌరవభావాన్ని కనపరచుతారు. బాధలతో, అసౌఖ్యంతో, అశాంతితో బాధింపబడే వారికి, తమ ఆప్తులను కోల్పోయి ఒంటరిగా

మిగిలిన వారికి, వృద్ధులకు, నిస్సహాయులకు ఈ మతం ఎంతో ఉపశమనం కలిగిస్తోంది. ఈ ప్రపంచంలోని కోట్లాది మందికి ఎవ్వరూ అందించలేని ప్రశాంతతను, సంతృప్తిని మతం అందిస్తూనే వుంది. యువతను క్రమశిక్షణలో పెట్టడానికి ఈ మతం తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ఎంతగానో తోడ్పడింది. అంతేకాదు. సమాజంలో అట్టడుగున అతి నీచస్థాయిలో బ్రతికేవారి జీవితానికి ఈ మతం ఒక అర్థాన్ని, హుందాను కలిగించింది. తమ బోధనలద్వారా దైవత్వభావనను ప్రతి ఒక్కరిలో కలుగజేసి మానవ సమాజంలో స్థిరత్వాన్ని, ఏకత్వాన్ని ఈ మతం సాధించకలిగింది. పూర్వపు రోజులలో మతం సహాయం లేకుండా ఏ సమాజంలోను నైతిక ప్రవర్తనను సవ్యంగాకట్టడి చేసిన సందర్భం చరిత్రలో ఎక్కడా కనిపించదు. ఇప్పుడు మనదేశంగాని, పాశ్చాత్యదేశాలు గాని ప్రభుత్వాలకు మతంతో సంబంధంలేని విధంగా రాజ్యాంగాలను రూపొందించుకున్నాయి. కాని సామాజిక కట్టుబాట్ల ను అమలులో ఉంచడానికి ఈ ప్రభుత్వాలన్నీ విధిగా మతంపైనే ఆధారపడు తుంటాయి.

ఇటీవల వరకు కమ్యూనిజం అమలులో వున్న దేశాలలో మతబోధనలపైన అనేక నిర్బంధాలుండేవి. కొంతకాలం పాటు మతం కలిగించే ఉపశాంతిని, ఆశను ఆ కమ్యూనిస్టు సిద్ధాంతాలే ప్రజలకు కల్గించి అవి మతస్థానాన్ని ఆక్రమించకలిగాయి. కాని ఈ సిద్ధాంతాలపట్ల నమ్మకం కోల్పోయిన ప్రజలు తిరిగి మూకుమ్మడిగా తమ పూర్వపు మత విశ్వాసాలవైపు మూఢంగా, గాఢంగా మళ్ళిపోవడాన్ని మనం గమనించాము. తమ తమ దేశాల్లో బీదరికాన్ని, తీవ్రమైన అసంతృప్తిని పారద్రోలలేని కమ్యూనిస్టు ప్రభుత్వాలు పేకమేడలలాగ కూలిపోగానే ప్రజలు మతం వైపు పరుగులు తీశారు. బీదరికం, దుఃఖం ఉన్నంతవరకు దేవుడి అవసరం, మతం అవసరం వుంటూనే వుంటుంది.





# కలగలసిపోతున్న ఆర్థిక వ్యవస్థలు, సిద్ధాంతాలు

ఎటువంటి ఆర్థికవ్యవస్థ అయినా లాభదృష్టిని కలిగించినప్పుడు మాత్రమే వ్యక్తులు గాని, వ్యక్తుల బృందాలుగాని ఉత్పత్తి రంగంపైకి తమ దృష్టిని మరల్చకలుగుతారు. ఎటువంటి లాభాపేక్షలేకుండా పనిచేయమంటే ఏ ఒక్కరూ పనిచేయరు. బానిసత్వ విధానంగాని, సైనిక నియంతృత్వంగాని, సైద్ధాంతిక ఉత్తేజంగాని ఎంతోకాలం ఫలితాలను కనపరచలేవు. పైగా ఈ విధానాలలో వనరులన్నీ వృధా కావడం, ఉత్పత్తి తీవ్రంగా కుంటుబడడం జరుగుతుంటుంది. మన ఉత్పత్తి సామర్థ్యం ఆధారంగానే మన ప్రతిభను ఎవరైనా అంచనా వేస్తుంటారు. ఒక్క యుద్ధంలో మాత్రమే విధ్వంసక సామర్థ్యాన్ని బట్టి సైనికుల ప్రతిభా విశేషాలను అంచనా వేయడం జరుగుతుంటుంది.

ఇలా ఉత్పత్తి చేయగల సామర్థ్యం వ్యక్తికి, వ్యక్తికి మారుతుంటుంది. అన్ని వేళలా, అన్ని సమాజాలలోను అత్యధికశాతం సామర్థ్యాలు అతి కొద్ది శాతం మంది ప్రజలలోనే వుంటున్నాయి. ఇలా కొద్దిమందికి మాత్రమే ఉత్పత్తి సామర్థ్యం వుండడం వలన సహజం గానే వారివద్దే సంపద పోగవుతుంది. ఇది చరిత్రలో అనాదిగా జరుగుతూనే వస్తోంది. కొద్ది మంది ధనవంతుల వద్ద సంపద పోగుపడడాన్ని అత్యధికశాతం మంది బీదప్రజలు ప్రశ్నించడం ప్రారంభించినప్పుడు, కొద్దిమంది మాత్రమే విలాసాలలో మునిగితేలుతూ ఇతరులంతా బీదరికంతో కొట్టుమిట్టాడుతున్నప్పుడు ఏ సమాజంలోనైనా ఒక అస్థిరత చోటు చేసుకుంటుంది. ఈ సామాజిక అస్థిరతను మానవ చరిత్ర చక్కగా పరిష్కరించ కలిగింది. ప్రజాస్వామికదేశాలలో చట్టాలు రూపొందించి, పన్నులు విధించి, సంపదను

అందరికి పంచిపెట్టే ప్రయత్నం జరుగుతుంటుంది. ఇక విప్లవాలు చోటుచేసుకున్న దేశాలలో ధనవంతులనుండి సంపదను బలవంతంగా లాక్కొని పేదరికానికి అందరూ తలలు వంచేలా చేయడం జరుగుతుంటుంది.

సోషలిస్టు సిద్ధాంతాలకు, పెట్టుబడిదారీ సిద్ధాంతాలకు చరిత్రలో ఎప్పటికప్పుడు ఘర్షణ తలెత్తుతుంటుంది. సంపద కొద్దిమంది దగ్గర మాత్రమే పోగుపడడం ఆ తరువాత కొంతకాలానికి దానిని పదిమందికి పంచిపెట్టడం, తిరిగి కొంతకాలానికి సంపద కొద్దిమంది దగ్గరే పోగుపడడం ఇదిచరిత్రలో నిరంతరం సాగుతూనే వుండేది. ఈ నిరంతర ఘర్షణను తప్పించుకోవడానికి ఈ దశాబ్దంలో పెట్టుబడిదారీ శక్తులు కొత్త మార్గాన్ని ఎంచుకున్నాయి. కార్పొరేట్ కంపెనీలు నెలకొల్పి ప్రజలు పొదుపు చేసుకున్న సొమ్మును షేర్ల రూపంలో పెట్టుబడిగా స్వీకరించి ప్రజలకు తిరిగి ఆ పెట్టుబడిపైన లాభాలను, వడ్డీని అందించడం జరుగుతోంది. అంతేకాదు, పరిశ్రమలలో, వ్యవసాయంలో క్రొత్తక్రొత్త యంత్రాలను ప్రవేశపెట్టడానికి ఈ పెట్టుబడిని ఉపయోగించడంతో కనీవినీ ఎరుగని రీతిలో వస్తూత్పత్తి జరుగుతోంది. కేవలం ధనిక వర్గానికి మాత్రమే అందుబాటులోవున్న సరుకులు, వస్తువులు, వాటి ఉత్పత్తి ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడంతో చరిత్రలో ఏనాడూ ఊహించి ఎరుగని రీతిలో అవి ప్రజలందరికీ అందుబాటులోకి వస్తున్నాయి. ఈ ఫలితాలు చూసిన తరువాత పెట్టుబడి దారులు చేస్తున్న వాదనకు బలం చేకూరుతోంది. తమపై ఎటువంటి నిర్బంధాలు విధించకుండా, తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని దెబ్బతీయకుండా, తమను స్వేచ్ఛగా వదలివేసినట్లయితే ప్రజలకు ఆహారధాన్యాలు అమితంగా అందించగలమని, ఇళ్ళు, గృహోపయోగ పరికరాలు, ఆహ్లాదకరమైన వినోదాలు కల్పించగలమని పెట్టుబడిదారులు చెబుతుంటారు.





రాజకీయవాదుల పరోక్ష నిర్వహణలో సాగే ఆర్థిక వ్యవస్థలో ఇలా ఉత్పత్తి ఫలితాలను ప్రజలందరికీ చేరేలా చేయడం సాధ్యంకాదని వారు వాదిస్తారు. మన దేశానుభవంనుండి పరిశీలిస్తే ఇది వాస్తవమేననిపిస్తుంది. మనప్రభుత్వనేతలు ఈ విషయాన్ని గుర్తించి పరిశ్రమలపై నిర్భందాలను తొలగించడానికి స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు నలభైయేళ్ళు పట్టింది.

ఈ సంగతి అలా ఉంచితే పారిశ్రామికవేత్తలు చేసే ఆర్థిక కుంభకోణాలు, అన్యాయంగా ధరలు పెంచివేయడం అక్రమ పద్ధతులద్వారా సరైన పోటీ లేకుండా చేయడం, పన్నులు ఎగవేయడం, ప్రజలను తప్పుద్రోవ పట్టించడం ఎందుకు జరుగుతుందో ఈ స్వేచ్ఛా ప్రియులు వివరించలేరు. వీరికి పూర్తి స్వేచ్ఛనిచ్చిన తరువాత ఇటువంటి కుంభకోణాలు చోటుచేసుకోవడం ప్రతిదేశంలోను, ప్రతి కాలంలోను జరుగుతూనే వస్తోంది. ఇది తారస్థాయికి చేరిన తరువాత వీటిని అదుపుచేసే నిరంకుశ ప్రభుత్వాలు, సోషలిస్టు వ్యవస్థలు తలెత్తడం మనం గమనిస్తూనే వున్నాము.

చరిత్రలో మనకు తెలిసిన మొదటి సామ్యవాద ప్రయోగం ఇప్పుడు మనం పెరూగా పిలుస్తున్న 'ఇంకాస్' దేశంలో అతి ఎక్కువకాలంపాటు కొనసాగింది. దాదాపు 13వ శతాబ్దంలో ఆ దేశంలో ఈ ప్రయోగం మొదలయింది. ఆ దేశపు రాజు సూర్యభగవానుడి ప్రతినిధి అని ప్రజలు విశ్వసించేవారు. ఆ దేశంలో వాణిజ్యం, వ్యవసాయం తదితర రంగాలన్నీ ప్రభుత్వమే నిర్వహించేది. ఆ దేశంలోని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగే. ఆ విశాలమైన దేశంలో రోడ్లు వేయడం దగ్గరనుండి, ఇళ్లు కట్టడం వరకు ప్రభుత్వ బాధ్యతగానే ఉండేది. ప్రజలందరూ తమ జీవనానికి, ఆహారానికి పూర్తి భద్రత కల్పించే వ్యవస్థలో 250 సంవత్సరాలపాటు సుఖసంతోషాలతో కాలం గడిపారు. 1533లో పిజారో దండయాత్ర చేసి పెరూను వశం చేసుకున్న తరువాత ఆ సామ్యవాద వ్యవస్థ అక్కడ ఛిన్నాభిన్నమైపోయింది. ఇక ఆధునిక కాలంలో రష్యాలో కమ్యూనిస్టు విప్లవం

చోటుచేసుకుంది. కాని ఆ సమయానికి ఆ దేశంలో పెట్టుబడిదారి వ్యవస్థ చాల శైశవ దశలో వుంది. జార్ ప్రభుత్వం 1917లో కూలిపోవడానికి కారణం పెట్టుబడిదారి వ్యవస్థ పై ప్రజలలో కలిగిన ఏహ్యాభావం కానేకాదు. జార్ ప్రభుత్వం యుద్ధంలో ఓడిపోయి ప్రజల దృష్టిలో చులకనై తన విలువను కోల్పోయింది. పైగా ప్రభుత్వ నిర్వహణ అయోమయంలో పడి రష్యన్ ఆర్థిక వ్యవస్థ గందరగోళంలో చిక్కుకుంది. అంతర్గత కుమ్ములాటలు, అస్తవ్యస్త పాలన, యుద్ధభయం చుట్టూ ముసిరినప్పుడు రష్యన్ ప్రజలు తమ దేశంలో భద్రత ఏర్పడడానికి, సక్రమపాలన నెలకొనడానికి అనువుగా తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పణంగా పెట్టారు. చాలా కాలం యుద్ధభయం రష్యాలో కమ్యూనిజం నిలదొక్కుకొనేలా చేసింది. ఆతరువాత మరికొంత కాలం నిరంకుశ పాలన, క్రూరమైన దండన ప్రజలను నోరెత్తకుండా చేశాయి. కాని చిట్టచివరకు ఇవేవీ అక్కడ కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కాపాడలేక పోయాయి. అన్ని రంగాల్లోను ఉత్పత్తి కుంటుపడడంతో ఉత్పత్తి రంగంలో చురుకుగా పాల్గొనేట్లు ప్రజలను ఉత్తేజితులను చేయవలసిన అవసరం ఏర్పడింది. అందుకై కమ్యూనిస్టు ప్రభుత్వం తమ ప్రజలకు పరిమిత స్థాయిలోనే స్వేచ్ఛను ప్రసాదించింది. ఆ స్వేచ్ఛ ప్రభుత్వం చెప్పే విషయాల నిజానిజాలను తేల్చిచూసే అవకాశం ప్రజలకు కల్పించింది. ఫలితంగా ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి నెలకొని చివరకు కమ్యూనిస్టు పార్టీయే ఆ దేశంలో నిషేధించబడే పరిస్థితి ఏర్పడింది.

ఈ సోషలిస్టు ప్రభుత్వాల ప్రయోగం విఫలమైనా వాటి ప్రభావం మాత్రం పెట్టుబడి దారీ వ్యవస్థపై తీవ్రంగా పడింది. ఫలితంగా వ్యక్తుల సంపదను నియంత్రిస్తూ పెట్టుబడిదారీ దేశాలన్నీ అనేక చట్టాలు చేశాయి. సంక్షేమ రాజ్యాలుగా తమను తాము పరిగణించు కుంటూ, సంపద, ఉత్పత్తిలో భాగస్వాములు కాని వారికి కూడ ఆ ఉత్పత్తి ఫలితాలను అందించే అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాయి. పెట్టుబడిదారీ శక్తుల ప్రభావంతో సోషలిస్టు దేశాలు మరింతటి స్వేచ్ఛను ప్రజలకందిస్తే, సోషలిస్టు దేశాల ప్రభావంతో పెట్టుబడిదారీ దేశాలు ప్రజల మధ్య మరింతటి సమానత్వం సాధించడానికి కృషిచేసాయి. ఇపుడు ఆరెండు రకాల వ్యవస్థలు కలగలసిపోయి ఒకేరకంగా రూపొందాయి.





# అల్ప సంఖ్యాకుల పాలన

ఏ కోవకు చెందిన ప్రభుత్వం మనకు మేలు చేస్తుంది? ఈ విషయమై చరిత్ర మనకు తెలియజెప్పేదేమిటి? చరిత్రలో అతి ఎక్కువ కాలంపాటు దాదాపు అన్ని దేశాలలోను నెలకొన్నవి రాజరిక వ్యవస్థలే. కాని ఈ రాజరికాలు క్రమంగా మానవజాతికి శాపాలుగా తయారయ్యాయి. అవి క్రమేణా అంతరించసాగాయి.

ఆధునిక కాలంలో ప్రభుత్వవ్యవస్థలు అతి విస్తృతంగా, అతి సంక్లిష్టంగా ఏ ఒక్కరికీ అర్థంకానంతటి విపరీతంగా రూపొందాయి. ఫలితంగా ఇపుడు ప్రభుత్వాలన్నింటిని పాలించేది ఒక అల్పసంఖ్యాక బృందమే. అత్యధిక శాతం మంది ప్రజలు పరిపాలనలో జోక్యం కలిగించుకోవడం, అందరూ ఐక్యంగా కార్యాచరణకు పూనుకోవడం, ఎక్కడా సాధ్యమయ్యే పనికాదు. సంపద ఎప్పుడూ కొద్దిమంది దగ్గర మాత్రమే పోగుపడుతుందని ఇంతకు ముందు ఒకసారి చెప్పుకున్నాము. అదే కోవలో పరిపాలనాసామర్థ్యం కూడా అతి కొద్దిమంది వ్యక్తులకే వుంటోంది. అందువలన అతి కొద్దిమంది చేత మాత్రమే పరిపాలన సాగించే ప్రభుత్వాలు ప్రపంచదేశాలన్నింటిలోను కొనసాగుతున్నాయి. ప్రజాస్వామిక దేశాలైనా, సైనిక నియంతృత్వాలైనా అతి కొద్దిమంది వ్యక్తులతో మాత్రమే పరిపాలించబడుతున్నాయి. ప్రభుత్వ నిర్వహణను నియంత్రించే అధికారం అత్యధిక శాతం మంది ప్రజలకు ఎప్పుడూ వుండదు. ప్రజలు ప్రభుత్వంపై కోపం వచ్చిన ప్రతిసారీ ఎన్నికల ద్వారానో, మరోరకంగానో ఆ ప్రభుత్వాన్ని తొలగించి మరో ప్రభుత్వాన్ని ఏర్పరుచుతారు. తిరిగి ఈ ప్రభుత్వంలో సైతం అతి కొద్దిమంది మాత్రమే నిర్ణయాలు తీసుకుంటూ పరిపాలన సాగిస్తుంటారు.



# చరిత్రలో విప్లవాలకున్న స్థానం ఏమిటి ?

ఆర్థికప్రగతి స్థంబించిపోయినపుడు ఉత్పత్తిని పెంచడం కోసం ప్రపంచంలో విప్లవాలు చోటుచేసుకున్నాయి. అలాగే మారుతున్న ఆర్థిక వ్యవస్థ, తనకు అనుకూలమైన వర్గాన్ని అధికారంలోకి తీసుకురావడం కోసం విప్లవాన్ని ప్రవేశపెడుతుంది. ఫ్రెంచ్ విప్లవం పరిపాలనాధికారాన్ని భూస్వామ్యవర్గాన్నుండి వాణిజ్యవర్గానికి అందించింది. కాని విప్లవంతో పనిలేకుండా 19 వశతాబ్దంలో ఇంగ్లండులో ఇటువంటి మార్పు శాంతియుతంగా చోటు చేసుకుంది. గతాన్ని పూర్తిగా తుడిచివేసి నూతనధ్యాయం ప్రారంబించాలని చాలా మంది విప్లవకారులు అన్నిచోట్లా కలలు కంటూనే ఉంటారు. గతం స్మృతులన్నీ చెరిగిపోతే మన మానసిక స్వస్థత ఎంతగా దెబ్బతింటుందో అలాగే ఏ దేశంలోనైనా ఆ జాతి సంప్ర దాయాలను పూర్తిగా నిర్మూలించితే ఆ దేశ స్వస్థతకు అంతే విఘాతం కలుగుతుంది.

రక్తపాత విప్లవాలు ఎక్కడైనా సంపదను నాశనం చేసాయేతప్ప, ఆ సంపదను ప్రజలందరికీ పంచిపెట్టడం జరుగలేదు. భూమిని ప్రజలకు పంచి ఇవ్వవచ్చు. కాని మానవులలో వున్న సహజమైన అసమానతల కారణంగా కొంతకాలానికి ఉత్పత్తిసాధనాలు కొద్దిమంది వద్దకే తిరిగి చేరడం, మిగిలినవారు సర్వం కోల్పోవడం జరుగుతూనే వుంటుంది. చరిత్ర మనకు పదేపదే చెప్పే విలువైన గుణపాఠం ఒకటుంది. భౌతిక సంపదను ప్రజ లందరికీ పంచడం వలన పెద్దగా ప్రయోజనం వుండదు. కాని మేధాసంపదను ప్రజలందరి లోను ప్రజ్వరిల్లింప చేయకలిగినప్పుడు, వారి వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దకలిగినప్పుడు

మాత్రమే నిజమైన విప్లవం మానవ సమాజంలో చోటుచేసుకుంటుంది. నిజమైన విప్లవం ఉద్ధరించవలసినది పేద ప్రజలనూ కాదు. అట్టడుగు వర్గాలనూ కాదు. అంధకారంనుండి, అజ్ఞానంనుండి బయటపడవేయవలసింది, జీవితానికి ఒక మార్గాన్ని, ఒక అర్థాన్ని ప్రసాదించవలసింది వ్యక్తికి మాత్రమే. అంటే నిజమైన విప్లవకారులు తుపాకులు పట్టుకొని అరణ్యాలవెంబడి తిరిగే పిరికివారుకాదు. వ్యక్తిని ఉద్ధరించడానికి నిరంతరం శ్రమించే మేధావులు, తత్వవేత్తలు, మనో వైజ్ఞానికులు, రచయితలు మాత్రమే అసలైన విప్లవకారులు.

అన్నిరకాల ప్రభుత్వాలలోకి ప్రజాస్వామిక ప్రభుత్వనిర్వహణే అత్యంత కష్టసాధ్యమైనది. అత్యధికశాతం మంది ప్రజలు అప్రమత్తంగా వున్నప్పుడుమాత్రమే ప్రజాస్వామ్యం సవ్యంగా మనకలుగుతుంది. ఇలా ప్రజలు అప్రమత్తంగా వుండాలంటే వారికి అందుకు తగిన తెలివి తేటలు ఉండితీరాలి. కాని పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, సార్వభౌమాధికారం సంక్రమించిన తరువాత నిరంతరం అప్రమత్తంగా వుండడానికి, ప్రభుత్వ నిర్వహణ పట్ల అవగాహన పెంపొందించుకోవడానికి ప్రపంచంలో ఎక్కడా ప్రజలు ప్రయత్నించరు. అయినా అన్ని రకాల ప్రభుత్వాలకంటే ప్రజాస్వామిక ప్రభుత్వమే ప్రజలకు తక్కువ హానిని, ఎక్కువ మేలును కలిగిస్తుంది. ప్రజాస్వామిక స్ఫూర్తి ఏథెన్స్‌ను, రోమ్‌ను చరిత్రలో అత్యంత సృజనాత్మకమైన నగరాలుగా తీర్చిదిద్దింది. ఈ ప్రజాస్వామ్యమే కేవలం రెండు శతాబ్దాల కాలంలో అమెరికాను అన్ని రంగాలలోను అగ్రభాగాన నిలిపింది. ఈ దేశ ప్రజలలో అత్యధికశాతం మందికి ఆహారాన్ని, సుఖసంతోషాలను అందించకలుగుతోంది.





ఇప్పుడు ప్రజలందరికీ విద్యావకాశాలు కలిగించడానికి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రజాస్వామ్య దేశాలన్నీ అంకితమయ్యాయి. విద్యనేర్చుకునే అవకాశాలు ప్రతి ఒక్కరికీ కల్పించినప్పుడు ప్రజాస్వామ్యం సక్రమంగా, సజీవంగా మనకలుగుతుంది. మానవుల మధ్య సమానత్వం లేదు. రాదు. కాని ప్రతి ఒక్కరికీ విద్యావంతులవగల అవకాశాలను కల్పించినపుడు సమానత్వం కొంతవరకైనా నెలకొంటుంది. ఇప్పుడు పశ్చిమ యూరప్ దేశాలలోను, అమెరికాలోను, ఇటు మనదేశంలోను ప్రజాస్వామ్యం రోజురోజుకు పరిపుష్టం అవతోంది. కాని అనుకోకుండా యుద్ధాలు చెలరేగితేనో, మత విద్వేషాలు, జాతివైరాలు ప్రజ్వరిల్లితేనో, ఇతర రాజకీయ వ్యవస్థల పట్ల తీవ్రమైన ద్వేషం పెచ్చరిల్లితేనో, తమ దేశ సమస్యలను సమగ్రంగా అవగాహన చేసుకొని సరైన రీతిలో పరిష్కరించలేని అసమర్థులు అధికారంలోకి వస్తేనో, ప్రజాస్వామ్యం విఫలమయ్యే ప్రమాదం ఎప్పుడూ వుంటుంది. సంపదను సృష్టించ కలిగిన సామర్థ్యాన్ని, ఆ సంపదను పంపిణీ చేయడంలో చూపించలేనప్పుడు ప్రజలందరికీ రక్షణను, భద్రతను వాగ్దానంచేసే ఏ వదరుబోతైనా నియంతగా రూపొందే ప్రమాదం ప్రజాసామ్యాలన్నింటినీ నిరంతరం వెన్నాడుతూనే ఉంటుంది. అలాగే సైనిక శక్తిని బలీయంగా రూపొందించే ప్రభుత్వాలు సైతం తోటి ప్రజాస్వామిక దేశాలను భయకంపితులను చేస్తూనే వుంటాయి.



# చరిత్ర యుద్ధాలకు వీడ్కోలు చెబుతోంది

గత 3460 సంవత్సరాల చరిత్ర మాత్రమే మనకు తెలుసు. అందులో కేవలం 268 సంవత్సరాలపాటు మాత్రమే యుద్ధాలులేవు. జీవులు తమ మనుగడకై సాగించే పోరాటం వంటిదే, దేశాలు తమ మనుగడకు సాగించే యుద్ధాలుకూడా, వందలాది సంవత్సరాలపాటు లక్షలాదిమంది శ్రమతో నిర్మించుకున్న అపూర్వమైన నగరాలను యుద్ధం భస్మీపటలం చేసెయ్యగలదు. నాగరికతను, సంస్కృతిని, అనేక కళారూపాలను క్షణాలలో ధ్వంసం చేయగలదు. కాని మానవ పరిణామ క్రమంలో బాధ్యతా రహితులైన నియంతలు, మూర్ఖులైన దేశాధినేతల ఆధిపత్యంలో వున్న దేశాలలో విజ్ఞానశాస్త్రాభివృద్ధి, పరిశోధనలు పూర్తిగా కుంటుబడిపోవనడం ప్రజాస్వామిక దేశాలలో మాత్రమే అతి విలువైన పరిశోధనలు జరుగుతుండడం మనం గమనించవచ్చు. అతి విలువైన ఉత్పత్తి శక్తులతోబాటు, అతి భయంకరమైన విధ్వంసక శక్తులు సైతం ఇప్పుడు ప్రజాస్వామిక దేశాలవద్ద, అభివృద్ధి చెందిన దేశాలవద్ద మాత్రమే వున్నాయి. ఫలితంగా ఇతర దేశాలతో యుద్ధానికి దిగడానికి ఉవ్విళ్ళూరే ఉన్మాదులను ఎప్పటికప్పుడు అదుపుచేయగల సామర్థ్యంకూడా ఉన్నతస్థాయికి చెందిన ప్రజాస్వామిక ప్రభుత్వాలకే సమకూడింది. తమదేశ సమస్యలకు, పేదరికానికి పరిష్కారం యుద్ధమేనని ఇప్పుడు ఎవ్వరూ విశ్వసించడంలేదు. అలా విశ్వసించే చిన్నచిన్న దేశాలకు యుద్ధాలు చేసే అవకాశాలు లేవు. విస్తారమైన సైనిక శక్తిని సంతరించుకున్న సంపన్న దేశాలకు యుద్ధం చేయవలసిన అవసరం లేదు. ఫలితంగా మూడో ప్రపంచ యుద్ధం చోటు చేసుకుంటుందేమోనన్న భయం ఇప్పుడు మనల్ని వేధించడం లేదు. చరిత్రలో ఇదొక అద్భుత పరిణామం.



# గత చరిత్ర పునరావృత్తమవుతుందా?


ప్రపంచ చరిత్రలో అనేక నాగరికతలు ఎప్పటికప్పుడు కాలగర్భంలో కలసి పోవడానికి కారణం ఏమిటి? ఇలా ప్రతి నాగరికత శిధిలాల వెనుకకు జేరిపోతుంటే మనం ఇప్పుడు సృష్టించుకుంటున్న నాగరికత కూడా భవిష్యత్తులో ఎప్పుడో ఒకప్పుడు కుప్పకూలిపోతుందా? ఇలా కూలిపోతుందనే చాలమంది పండితులు, తత్వవేత్తలు ఊహా గానాలు చేసారు. చరిత్ర ఎప్పటికప్పుడు పునరావృత్తం అవుతుంటుందని చాలమంది అంటుంటారు. చరిత్ర యధాతధంగా పునారావృత్తం కావటం ఎక్కడా జరుగదు. అది సాధ్యంకూడా కాదు. గతంలో లాగానే భవిష్యత్తులో కూడా కొత్తదేశాలు ఆవిర్భవిస్తాయి. పాత దేశాలు తమ ప్రాభవాలు కోల్పోతాయి. నూతన పరిశోధనలు ప్రజలకు నూతన అవకాశాలు కల్పిస్తాయి. అలాగే తప్పులు, లోపాలు, బలహీనతలను మేధావులు ఎత్తి చూపుతారు. యువతరంవారు వృద్ధతరంపై తిరుగుబాటుచేస్తూనే ఉంటారు. మళ్ళీ సర్దుకుపోయి పాత పద్ధతులనే అనుసరిస్తూ జీవితంలో స్ధిరపడి తిరిగి కొత్తతరం తమను ధిక్కరిస్తుంటే ఆగ్రహంతో మండిపడిపోతుంటారు. అంతే తప్ప గతంలో చోటుచేసుకొన్న సంఘటనలన్నీ భవిష్యత్తులో యధాతధంగా పునరావృత్త మవుతాయని చెప్పడం సరికాదు. అంతేకాదు. ఎప్పటికప్పుడు, ప్రతి సంవత్సరమూ, ప్రతి సంఘటనా కొంగ్రొత్త అనుభవా లను, క్రొత్తక్రొత్త గుణపాఠాలను నేర్పుతూనే వుంటుంది.

ఎప్పుడైనా, ఎక్కడైనా ఒక నాగరికత ఎందుకు పతనమవుతుంది? రాజకీయ

నాయకత్వం, మేధావి వర్గం మారుతున్న పరిణామాలను అకళింపు చేసుకోకపోవడం వలన, మార్పును స్వీకరించలేక పోవడంవలన చరిత్రలో అనేక నాగరికతలు దెబ్బతిన్నాయి. అసలు ఏ నాగరికతైనా పూర్తిగా అంతర్ధానమైపోతుందా? కాదు. గ్రీకు నాగరికత పూర్తిగా అంతర్ధాన మయిపోయిందా? లేదు. ఆజాతి జ్ఞాపకాలలో ఆ నాగరికత ఇంకా సజీవంగా నిలిచే వుంది. హోమర్ రచనలు ఆనాటికంటే ఈనాడే అతి ఎక్కువమంది చదువుతున్నారు. ఆనందిస్తున్నారు. గ్రీకు కవుల, తత్వవేత్తల రచనలు అన్నిదేశాలలోను, అన్ని భాషలలోను ఇప్పుడు విరివిగా లభ్యమవుతున్నాయి. ప్లేటో సిద్ధాంతాలపైన, ఆయన ప్రతిపాదించిన తాత్విక విషయాలపైన, ప్రపంచంలో ఇప్పటికీ ఏదో ఒక మూల చర్చలుసాగుతూనే వుంటాయి. ఆ కాలంనాటి సృజనాత్మక వ్యక్తులు మానవజాతిలో అమరులుగా నిలిచి వుండటం ఆ నాగరికత సాధించిన విజయంకాదా?

ఒక దశలో ఔన్నత్యాన్ని అందుకున్న దేశాలు కొంతకాలానికి తమ ప్రాభవాన్ని కోల్పోవచ్చు. సస్యశ్యామలమైన ప్రాంతాలు ఎడారులుగా మారవచ్చు. అప్పుడు నూతన మార్పులకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోగల వ్యక్తులు, తమ ఉత్పత్తి సాధనాలను, తమ కళారూపాలను చేతపట్టుకొని మరోచోటుకు తరలి వెళుతుంటారు. తమ జ్ఞాపకాలను వెలికితీసి మరోతరానికి నిరంతరం అందజేస్తుంటారు. ఇలా తమ జాతి నాగరికతా వైభవాన్ని తమతోపాటు తీసుకొని వెళ్ళిన వ్యక్తులు, లేదా బృందాలు మరోచోట, మరో అపూర్వమైన నాగరికత వెల్లివిరయడానికి బీజాలు నాటుతారు. చరిత్రలో ఇలా గ్రీకు నాగరికత రోమ్‌కు వెళ్ళింది. రోమన్ నాగరికత తిరిగి మరింతటి ఉన్నత





రూపంలో పశ్చిమ యూరప్‌కు తరలి వెళ్ళింది. తిరిగి పశ్చిమ యూరప్‌లో వెల్లివిరిసిన నాగరికతా వైభవాన్ని అమెరికా స్వీకరించింది. అంటే ఏ నాగరికతా ఫలితాలుకూడా వృధాపోవు. ఒక తరం నుండి మరోతరానికి అవి జాలువారుతుంటాయి. పునరుత్పత్తిద్వారా జీవితం మృత్యువును జయిస్తుంది. కొడుకులు, మనుమలకు, తన అనుభవాలను, తన జ్ఞానాన్ని వారసత్వంగా అందించిన వృద్ధుడు మరణించవచ్చు. కాని అతను తన వారసుల ప్రవర్తనలో, ఆలోచనా ధోరణిలో సజీవంగా మిగులుతాడు. ఇదే కోవలో ఏ సంస్కృతి అయినా పాతదైపోయి కొత్త పరిణామాలకు అనుగుణంగా మారలేకపోతే అది తన వారసత్వ సంపదను ఖండఖండాంతరాలకు వ్యాపింపజేసినా తానుమాత్రం రూపుమాసి పోతుంది. కాని ఈనాడు వచ్చిన సాంకేతిక విప్లవం వలన ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా అదే క్షణంలో మరోచోటవున్నవారు ఆ సంఘటనలను టి.వి.ల ద్వారా చూడకలుగుతున్నారు. ఇంటర్‌నెట్ ద్వారా తెలుసుకో కలుగుతున్నారు. ప్రపంచంలో వార్తా ప్రసార రంగం అతి విస్తృతంగా రూపొంది ప్రపంచాన్నంతటినీ ఒక వసుధైక కుటుంబంగా అతి త్వరితంగా మార్చివేస్తోంది. ఇంతకాలమూ అనేక దేశాలుగా, జాతులుగా, వర్గాలుగా, వేరువేరుగా జీవనం సాగించిన ప్రపంచ ప్రజలందరూ ఇప్పుడు ఒకరి అనుభవాలను మరొకరు పంచుకొంటూ, ఒకరి కళారూపాలను మరొకరు అభినందిస్తూ, ఒకరి జీవన విధానాన్ని మరొకరు ఆస్వాదిస్తూ మొత్తం ప్రపంచమంతా ఏక సమాజంగా రూపొందడానికి దోహదం చేస్తున్నారు. వివిధ నాగరికతలు విశిష్టరీతిలో సమ్మేళనం చెంది ఒక అపూర్వమైన మానవ నాగరికత ఉద్భవించే సమయం ఇంకా ఎంతో దూరంలో లేదు.



# మానవసమాజం ప్రగతిపథంవేపు పయనిస్తోందా?

భిన్నరకాల జాతులు, దేశాలు, సంస్కృతులు, నీతి నియమావళులు, మతాలు, నమ్మకాల మధ్య అసలు మానవజాతి ప్రగతిపథం వేపు నడుస్తున్నదా లేదా? చరిత్ర తెలిసి నప్పటినుండి ఇప్పటివరకు మానవ స్వభావంలో పెద్ద తేడా లేదని ఇంతకు ముందే చెప్పుకొన్నాం. అధునిక కాలంలో చేకూరిన సాంకేతిక ప్రగతి వలన మానవుడు పాత లక్ష్యాలు సాధించడానికి కొంగ్రొత్త మార్గాలు వెతుకుతున్నాడు. కొంగ్రొత్త సాధనాలను వినియోగించుకొంటున్నాడే తప్ప అతని మౌలిక ప్రవృత్తిలో పెద్దతేడా కన్పించదు. వస్తువులు సంపాదించడం పట్ల వ్యామోహం, స్త్రీపురుషులు ఒకరినొకరు అకర్షించడానికి ప్రయత్నించడం, ఒకరితో ఒకరు పోటీ పడడం, ఇతరులపై ఆధిక్యత కోసం పెనుగులాడడం అప్పుడూ ఇప్పుడూ ఒకేరకంగా వుంది.

ఆధునిక కాలంలో ఎప్పుడే ప్రమాదాలు జరుగుతాయో, ఎప్పుడే యుద్ధాలు వస్తాయో, ఎప్పుడు విధ్వంసకాండ జరుగుతుందో, ఎప్పుడు విపత్తు ముంచుకొస్తుందోనని మనం హడలిపోతూ బ్రతకడం–ఆదిమమానవులు అజ్ఞానం, మూఢనమ్మకాలు, హింసా కాండ, భయంకర వ్యాధుల మధ్య కొట్టుమిట్టాడడం–ఒకేరకంగా కన్పిస్తుంది. మానవుని స్థితి అప్పుడూ ఇప్పుడూ కూడా దయనీయంగా, అనిశ్చితంగా, అయోమయంగానే వున్నట్లు అనిపిస్తుంది. పూర్వకాలంలోని ఆది మానవుల స్థితికి, నేటి సమాజంలో అట్టడుగువారిస్థితికి

పెద్దతేడా లేకపోవచ్చు. కాని మన ప్రజలలో కోట్లాదిమంది బీదరికపు శృంఖలాలను విదుల్చుకొని నిరంతరం పైకి ఎదుగుతున్నారు. వారి మానసిక స్థాయి, నైతిక స్థాయి అత్యున్నతంగా వుంటున్నాయి. వీరికి ఆదిమ మానవులకు ఏకోశాన పోలికే లేదు.

ఆయుర్దాయం పెరగడం, ఏభై సంవత్సరాలకంటే ఇప్పుడు రెట్టింపుకావడం, మానవ ప్రగతికి ప్రమాణంగా పరిగణించితే పాశ్చాత్యదేశాలు, మరికొన్ని అభివృద్ధి చెందిన దేశాలు ప్రగతిని సాధించినట్లేనని నిశ్చయంగా చెప్పవచ్చు. గతంతో పోల్చిచూసినప్పుడు మనం అనేక రంగాలలో విశేష ప్రగతి సాధించాము. ఆహార ధాన్యాల ఉత్పత్తి పూర్వ కాలంలో ఏనాడూ ఊహించనంతటి స్థాయికి చేరుకుంది. కేవలం పదిశాతం మంది రైతులు ఆధునిక యంత్రాల సాయంతో వ్యవసాయం చేసి తొంభైశాతం మందిని పోషించగల స్థితి ఇప్పుడు ప్రపంచంలో నెలకొనివుంది. అలాగే విజ్ఞానశాస్త్రాల ప్రగతి అంధ విశ్వాసాలను చాలవరకు మానవ సమాజంనుండి తరిమివేసింది. ఆలాగే ప్రజలందరూ పటిష్టమైన గృహాలు, విద్య ఇతర సౌకర్యాలు అన్నింటికీ మించి విశ్రాంతి పొందకలగడం ఆధునిక సాంకేతిక ప్రగతి వలననే సాధ్యమవుతోందని చెప్పుకోవచ్చు. నేటి సమాజంలో ప్రజలు పొందే సౌకర్యాలు, సౌఖ్యాలు, కేవలం వంద సంవత్సరాల క్రితమే ఎవరూ ఊహించి ఎరుగనటువంటివి.

అనేక ప్రభుత్వాలు, అనేక నాగరికతలు చరిత్రలో కుప్పకూలిపోయి ఉండవచ్చు. కాని ఆనాటి ప్రజలు సాధించిన విజయాలు, వారు కనుగొన్న విషయాలు ఇప్పటికీ





నిరంతరాయంగా కొనసాగుతూ ఈనాటి మన నాగరికతకు చక్కటి ప్రాతిపదికను ఏర్పరిచాయి. నిప్పునురాజేయడం, వెలుగును సృష్టించడం, చక్రాన్ని రూపొందించడం మానవశ్రమను తగ్గించే ప్రాథమిక పరికరాలను తయారుచేయడం, అలాగే భాషను కనుగొనడం, వ్రాయడం, కళలు, పాటలు, వ్యవసాయం, కుటుంబవ్యవస్థ, సామాజిక వ్యవస్థ, కరుణ, నైతిక విలువలు ఇవన్నీకూడా చరిత్రలో అనేక ఒడిదుడుకులను, ఆటుపోటులను తట్టుకొని పరంపరానుగతంగా మనకు కూడా అందుబాటులోకి వచ్చాయి. అలాగే విద్యావంతులు చిన్నవారికి బోధించడం, కుటుంబసాంప్రదాయాలను, జాతి సాంప్రదాయాలను నూతన తరానికి ఎప్పటి కప్పుడు అందించడం, గతకాలపు నాగరికత అందించిన అమూల్యవరాలు. ఈ వరాలన్నీ మానవజాతి చరిత్రను అనుసంధించే జీవ కణాలవంటివి.

నాగరికత ఒక తరాన్నుండి మరొక తరానికి భౌతిక సంపదలాగా వారసత్వంగా సంక్రమించదు. ప్రతి తరమూ గతకాలపు నాగరికతా వైభవాన్ని సవ్యంగా అవగాహన చేసుకొని, ఆ అవగాహనను తమకెదురయ్యే నూతన అనుభవాలతో జోడించి, మరింతటి సుసంపన్నమైన జీవనరీతిని రూపొందించుకోవడం ద్వారానే నాగరికత సజీవంగా, చైతన్యవంతంగా ముందుకు సాగుతుంటుంది. ఇలా నాగరికతావికాసం ఎప్పుడైనా ఓ వంద సంవత్సరాలపాటు నిలిచిపోతే నాగరికత నేర్పే విలువలన్నీ శిధిలమైపోయి మనం తిరిగి క్రూరమృగాలలాగా మారిపోతాము. నేటి సమాజంలో విద్యాబోధనపై కనీవినీ ఎరుగని స్థాయిలో అపారమైన నిధులను, అమితమైన మానవశ్రమను వెచ్చించడం చరిత్ర పరిణామ క్రమంలో ఒక అద్భుతమైన విజయంగా చెప్పుకోవచ్చు. పదివేల సంవత్సరాల నాటి ఘోరతప్పిదాలు, అంధ విశ్వాసాల నుండి మన ఉపాధ్యాయులు పూర్తిగా సమాజాన్ని బయట పడవేయడంలేదని ఆరోపించడం అమాయకత్వమే అవుతుంది.

చరిత్రలో కనీవినీ ఎరుగనంతటి అద్భుత ప్రయోగం ఈ తరంలోనే ప్రారంభ మయ్యింది. సామాన్యమానవుని జ్ఞానస్థాయి బాగా పెరగడమేకాదు, మనం తరువాతి తరాల వారికి అందిస్తున్న జ్ఞాన సంపద అపూర్వమైనది. సుసంపన్నమైనది. గత కాలానికి చెందిన మహావిజ్ఞానవేత్తలు, తాత్వికులు, రచయితలు, కళాకారులు తమ తరువాతి తరాల

వారి కందించిన జ్ఞానసంపదనంతటిని కలగలిపినా, ఇప్పుడు ముందుతరాలకు మనం అందించబోయే జ్ఞానసంపదలో అది లేశమంతకూడావుండదు. మనం ఎన్ని విపరీత పోకడలు పోతున్నా మానవ ప్రగతి ఇలా నిరంతరాయంగా ముమ్ముందుకు సాగిపోవడానికి మూలకారణం ఏమిటి? వెయ్యేళ్ళ క్రితం పుట్టిన పిల్లవాడికంటే మనం ఏ మాత్రం ఆరోగ్య వంతంగా, బలంగా, తెలివితేటలతో జన్మించలేదు. మన అదృష్టం ఏమిటంటే ఆనాటి పిల్లల కంటే కోటిరెట్లు అధికమైన జ్ఞాన సంపద మనకు సంక్రమిస్తోంది.

చరిత్ర అంటే వేరేమీకాదు. మన జ్ఞానాన్ని వృద్ధిపరచుకోవడం, తరువాత తరానికి దానిని అందించడం మాత్రమే! జ్ఞానం యొక్క పరిమాణం. దానిని భద్రపరిచేతీరు, దానిని ఇతరుల కందించడంలో వేగంపైనే మానవజాతి ప్రగతి ఆధారపడి వుంటుంది. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా సృజనాత్మక శక్తి సంతరించుకొన్న కొట్లాదిమంది వ్యక్తులు ప్రతి ఒక్కరూ ఒక్కొక్క పరిశోధనాలయంలాగా, ఒక్కొక్క ప్రయోగశాలలాగా పనిచేస్తున్నారు. తాము కనుగొనే విశేషాలను శాశ్వతంగా భద్రపరచకలుగుతున్నారు. కొన్ని గంటల వ్యవధిలో ప్రపంచ మంతటికీ తమ అనుభవాలను తెలియజెప్పకులుగుతున్నారు.

గతంలో మానవులు చేసిన దుర్మార్గాలు, నేరాలను గురించి మనల్ని హెచ్చరించ డానికే చరిత్ర పరిమితంకాదు. కారాదు. చరిత్ర నేరాలతో , అబద్ధాలతో, నరహంతకులతో నిండిన మృత్యుగహ్వారం కానేకాదు. అద్భుతమైన వ్యక్తులు ఎందరో చరిత్రలో ఉద్భవించారు. వారు మానవజాతి సంక్షేమంకోసం నిరంతరం తపించారు. తమ జీవితాలను ధార పోశారు. వారే అంధకారమయమైన చరిత్రలో జ్ఞానజ్యోతుల్లా వెలుగొందుతూ ఇప్పటికి సైతం మనజీవితాలలో వెలుగులు నింపుతున్నారు. ఈ దృష్టినుండి సింహావలోకనం





చేస్తే చరిత్ర అంతా జాజ్వల్యమానంగా, కళ్ళుమిరుమిట్లు గొలిపే ఒక అద్భుతమైన పురాతన నగరంలా, ఒక అద్భుత దృశ్యం మనకు కనిపిస్తుంది. అందులో గొప్ప రాజనీతిజ్ఞులు, విజ్ఞానవేత్తలు, సాధుపుంగవులు, సంగీత విధ్వాంసులు, సృజనాత్మకతను నరనరాన జీర్ణించు కున్న కళాకారులు, కవులు, గాయకులు, ప్రేమికులు, తాత్వికులు మానవజాతి ఉన్నతికోసం ఆరాటపడుతూ ఎవరిమార్గాన వారు కృషిచేసిన దృశ్యం–మనం జీవితాంతం వారికి రుణ పడేలా చేస్తుంది.

ఇన్నివేల సంవత్సరాల మానవజాతి చరిత్ర ఇంతటి నిరర్ధకంగా సాగి పోయిం దేమిటని చరిత్రకారులెవ్వరూ విచారించరు. తాము కల్పించుకొనే విలువకు మించి మానవ మనుగడకు వేరే అర్ధమూ, పరమార్ధమూ ఏదీలేదు. మన జీవితాలను అర్ధవంతంగా తీర్చిదిద్దుకోకలిగినప్పుడు ఆ జీవితాన్నుండి అద్భుతమైన ఫలితం ఏదయినా వెలువడితే అది మనకు అమరత్వం ప్రసాదిస్తుంది. మనలో ఆదృష్టవంతులు తమ జీవితకాలంలో వీలైనంతటి జ్ఞానాన్ని సముపార్జించి తమ పిల్లలకు అందజేయకలుగుతారు. ఇటువంటి వారు తుది శ్వాస విడిచేవరకూ తమకు మానవజాతి వారసత్వంగా లభించిన జ్ఞానసంవదను చూసి నిండు హృదయంతో గర్విస్తారు. ఆ వారసత్వసంపదే మానవజాతికి 'మాతృదేవత'. మానవజీవితానికి 'ఆత్మ'.

# Manava Charitra Manaku Nerpe Gunapathalemiti?

**C.Narasimha Rao**

జీవితాన్ని, సమాజాన్ని, సవ్యంగా, సమగ్రంగా అవగాహాన చేసుకోవడానికి అనువైన మనో విజ్ఞానాన్ని తెలుగు ప్రజల ముంగిటకు తెచ్చిన తొలి తెలుగు మనో విజ్ఞాన మాసపత్రిక రేపు వ్యవస్థాపకులు. తెలుగు ప్రజల ఆలోచనాధోరణులను అమితంగా ప్రభావితం చేసే రచయిత
చల్లగుళ్ళ నరసింహారావు





విల్‌డురాంట్ పాతికేళ్ళ ప్రాయంలో వ్రాసిన గ్రంథం 'స్టోరీ ఆఫ్ ఫిలాసఫీ' ప్రపంచ వ్యాప్తంగా ఆమిత ప్రాచూర్యం పొంది ఆయనకు కోట్ల డాలర్ల పారితోష కాన్ని, గొప్ప పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించి పెట్టింది. తన కింతటి ఘనత లభించినందుకు కృతజ్ఞతాభారంతో, తోటి మానవాళికి తన రుణం ఎలా తీర్చుకోవాలా అని విల్‌డురాంట్ మధనపడి చివరకు వేల సంవత్సరాల మానవ చరిత్రను గ్రంథీకరించాలని నిర్ణయించుకొన్నాడు. ఆ క్రమంలో వేలాది పుస్తకాలను అధ్యయనంచేసి మానవ చరిత్రను క్రోడీకరించే ప్రయత్నం ప్రారంభించాడు. ఏదో నాలుగైదు సంవత్సరాలలో పూర్తవుతుందని భావించిన ఈ ప్రయత్నం చివరకు ఒక మహా యజ్ఞంలా, ఒక కఠినమైన తపస్సులా రూపొందింది. చివరకు పది సంపుటా లలో విల్‌డురాంట్ 'స్టోరీ ఆఫ్‌సివిలిజేషన్' పూర్తి చేయడానికి నలభై సంవత్సరాల సుదీర్ఘసమయం పట్టింది. యవ్వన ప్రాయంలో ప్రారంభించిన ఈ గ్రంధరచన పూర్తి చేసే సరికి తనకు పూర్తి వృద్ధాప్యం వచ్చేసిందని పేర్కొంటూ, మానవ చరిత్రను దశా బ్దాలపాటు ఆకళింపుచేసుకొన్న తనకు, ఈ చరిత్ర తెలియజెప్పే గుణపాఠాలను అంద రికి తెలియజెప్పాలన్న కోర్కె మిగిలి వుందని ఆయన పదవ సంపుటిలో తెలియజేశారు. అది వ్రాసే వరకు తాను బ్రతికుండగలనో లేదోనన్న అనుమానాన్ని కూడా ఆయన అందులో వ్యక్తం చేశారు. చివరకు 'లెసన్స్ ఆఫ్ హిస్టరీ' పేరిట పదకొండవ సంపుటిని వెలువరించారు. అదొక అద్భుత గ్రంథం. మొత్తం మానవ చరిత్ర చెప్పే గుణపాఠాలను ఆయన అతి స్పష్టంగా, సరళంగా, నిర్మొహమాటంగాఅందులో చెప్పడం జరిగింది. అది చదివిన మరుక్షణమే ఆ జ్ఞాన సంపద సారాన్ని తెలుగువారికి అందజేయాలన్న